జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన దినపత్రికలో
మంత్లీ అడ్వర్టైజ్‌మెంట్స్
4x5. Rs. 13,000/- p.m.
8x10. Rs. 24,000/- p.m.
12x10. Rs. 36,000/- p.m.
5 లైన్ల క్లాసిఫైడ్ యాడ్ రూ. 5000/- p.m.
Quarter Page (16x20) Ad (1st Page) Rs. 96,000/- p.m.
Contact : 8886022523, 9000621111, 9948725373

సంపుటి 7 సంచిక 301 | హైదరాబాద్, జనవరి 11 గురువారం 2024 | 8 పేజీలు | వెల : 5.00

# కొత్త విద్యుత్ పాలసీని తెస్తాం..

## గృహజ్యోతి పథకం అమలు చేస్తాం: రేవంత్



హైదరాబాద్ : త్వరలో కొత్త విద్యుత్ పాలసీని తీసుకొస్తామన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలోనూ, నిపుణులతోనూ విద్యుత్ విధానంపై విస్తృతంగా చర్చ జరుపుతామని తెలిపారు. 24 గంటలపాటు నిరంతర విద్యుత్తును అందించాల్సిందేనని, తక్కువ ధరకు విద్యుత్ ఇచ్చే కంపెనీల నుంచి కొనుగోలు చేయాలన్నారు. గృహజ్యోతి పథకం కింద ఉచిత 200 యూనిట్లకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, డి. శ్రీధర్ బాబులతో కలిసి సీఎం రేవంత్ నిర్వహించిన ఈ సమీక్షా సమావేశంలో విద్యుత్తు వినియోగం, 24 గంటలపాటు నిరంతర విద్యుత్తు సరఫరా, విద్యుత్తు సంస్థల ఉత్పత్తి, కొత్తగా ఉత్పత్తి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలు, ఎన్నికల్లో ఇచ్చిన గృహజ్యోతి పథకానికి రెండు వందల యూనిట్లను అందించడానికి తీసుకోవాల్సిన చర్యలు వంటి అంశాలపై చర్చించారు. అన్ని రాష్ట్రాలకంటే మెరుగైన విద్యుత్తు విధానాన్ని తెలంగాణలో అమలు చేయడానికి నిపుణులతో చర్చించి, అసెంబ్లీలోనూ అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులతో సుదీర్ఘంగా చర్చించి, సరికొత్త విద్యుత్ పాలసీని తీసుకువస్తామని సీఎం అన్నారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చి తీరాలని స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీలలో ఒకటైన గృహజ్యోతి పథకం ద్వారా ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, వివిధ విద్యుత్ కంపెనీల నుంచి విద్యుత్ కొనుగోళ్లు, రాష్ట్రంలో విద్యుత్ వినియోగం, డిస్కంల పనితీరు, ఆర్థిక పరిస్థితిపైనా వివరాలను సీఎంకు అధికారులు వివరించారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత 2014 నుంచి ఇప్పటిదాకా విద్యుత్ కంపెనీలు, విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) మధ్య జరిగిన ఒప్పందాలు, ఆ ఒప్పందాల్లోని అంశాలు, విద్యుత్తుకు చెల్లించిన ధరలు వంటివాటిపై సమగ్రంగా అధ్యయనం చేసి, పూర్తి వివరాలను అందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆర్థిక సంవత్సరాల వారీగా జరిగిన ఒప్పందాలను, వాటిలోని అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. ఎక్కువ ధర చెల్లించే విధంగా జరిగిన ఒప్పందాలకు కారణాలేమిటో కూడా నివేదించాలని ఆదేశించారు. బహిరంగ మార్కెట్లో ఎక్కడ తక్కువ ధరకు విద్యుత్ లభిస్తుందో, ఆ కంపెనీల నుంచే విద్యుత్ కొనుగోలు చేయాలని సీఎం ఆదేశించారు.

## అది ఆర్ఎస్ఎస్/బిజెపిల ఈవెంట్: కాంగ్రెస్




న్యూఢిల్లీ : అయోధ్యలో జరగనున్న ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకావడం లేదని కాంగ్రెస్ బుధవారం ప్రకటించింది. ఇది పూర్తిగా "రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)/ బిజెపి''ల రాజకీయ కార్యక్రమని అభివర్ణించింది. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సోనియాగాంధీలతో పాటు లోక్‌సభ ప్రతిపక్షనేత అధిర్ రంజన్ చౌదరిలకు ఆహ్వానం అందినట్లు సమాచారం. మతం అనేది వ్యక్తిగత అంశం. కానీ ఆర్ఎస్ఎస్ / బిజెపిలు అయోధ్య నిర్మాణాన్ని రాజకీయంగా మార్చాయని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ విమర్శించారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే బిజెపి అసంపూర్తిగా ఉన్న ఆలయాన్ని ప్రారంభిస్తోందని ధ్వజమెత్తారు. 2019 సుప్రీంకోర్టు తీర్పుకు కట్టుబడి, శ్రీరాముని గౌరవించే లక్షలాది మంది ప్రజల మనోభావాలను గౌరవిస్తూ.. మల్లికార్జున్ ఖర్గే, సోనియాగాంధీ, అధిర్ రంజన్ చౌదరిలు గౌరవపూర్వకంగా బిజెపి/ఆర్ఎస్ఎస్ ఆహ్వానాన్ని తిరస్కరించారని జైరాం రమేష్ స్పష్టం చేశారు.

## టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల రాజీనామాలను ఆమోదించిన గవర్నర్




హైదరాబాద్ : టీఎస్‌పీఎస్సీ చైర్మన్, ఐదుగురు సభ్యుల రాజీనామాలను గవర్నర్ తమిళిసై బుధవారం ఆమోదించారు. గత సంవత్సరం డిసెంబర్‌లో టీఎస్‌పీఎస్ చైర్మన్ బి.జనార్ధన్‌రెడ్డి రాజీనామా చేశారు. కాగా, టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్, సభ్యుల రాజీనామాలను వెంటనే ఆమోదించాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కోరారు. ఆ మేరకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను ఆయన లేఖ రాశారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల రాజీనామాలు చేసి నెల రోజులు గడుస్తున్నా.. గవర్నర్ వాటిని ఇంత వరకు ఆమోదించడం లేదని అన్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ లేకపోవడంతో ఉద్యోగాల భర్తీపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోతున్నామని లేఖలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గవర్నర్ బుధవారం టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల రాజీనామాలకు ఆమోదం తెలిపింది.

## ఆల్ తెలుగు ప్రజా పార్టీ పరిశీలకులను నియమించిన ఏటిపిపి సిడబ్ల్యూసి మెంబర్ నేరేళ్ల కోటేశ్వరరావు



హైదరాబాద్(ప్రజాపాలన ప్రతినిధి): అణగారిన వర్గాలకు రాజ్యాధికారం కోసం,బీసీ అభ్యర్థిని ముఖ్యమంత్రి చేయడం, ప్రతీ కుటుంబాన్ని లక్షాధికారి చేయడమే లక్ష్యంగా ఏర్పాటైన ఆల్ తెలుగు ప్రజా పార్టీ తమ రాష్ట్ర వ్యాప్తంగా పరిశీలకులను పార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కటికల శివ భాగ్యారావు ఆదేశానుసారం నియమించినట్లు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు నేరెళ్ల కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నియమితులైన పార్టీ పరిశీలకులు రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వారి పరిధిలోని అసెంబ్లీ నియోజక వర్గ ఇంచార్జిలను,అలాగే మండల స్థాయి ఇంచార్జిలను, ఎం.పీ.టీ.సీ., జడ్ పి టి సీ స్థాయి కమిటీ లను నియమించుకోవాల్సి ఉంటుందన్నారు. తద్వారా పార్టీ ఆశయాలు, పార్టీ మేనిఫెస్టో లో వెల్లడించిన 12 గ్యారెంటీలను 9 ప్రగతివరాలు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సి ఉంటుందన్నారు. ప్రతి కుటుంబానికి లబ్ధిచేకూరే విధంగా 12 గ్యారంటీలు తమ పార్టీ సంకల్పం అని బీసీ అభ్యర్థిని ముఖ్యమంత్రి - ప్రతి కుటుంబాన్నీ లక్షలాధికారులు చేయటం- అవినీతి రహిత పాలన అందించడం మన లక్ష్యం అని రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ ఇంటి గడప తట్టి చెప్పాలని ఆయన పేర్కొన్నారు.

## నెల రోజుల్లోనే కాంగ్రెస్ పాలనపై వ్యతిరేకత మొదలైంది : కేటీఆర్



వరంగల్: తెలంగాణ అభివృద్ధి కోసం కేసీఆర్ తన రక్తాన్ని రంగరించారు.. చెమట ధార పోశారు అనిబీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ 420 హామీల్లో ఇప్పటికే కొన్నింటినీ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు అని ఆయన తెలిపారు. వరంగల్ లోక్ సభ నియోజకవర్గ సన్నాహాక సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించిన మాట్లాడుతూ.. ప్రజలను వంచించాలనుకుంటున్న కాంగ్రెస్‌కి సినిమా ఇంకా మొదలు కాలేదు.. ఆసలు సినిమా ముందుంది అని పేర్కొన్నారు. నిరుద్యోగ భ్రుతి హామీ ఇవ్వనే లేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీ వేదిగా అబద్ధం చెప్పారన్నారు. కాంగ్రెస్ నిజ స్వరూపాన్ని వాళ్ళ 420 హామీలతోనే ఎండగట్టాలి అని పిలుపునిచ్చారు. సీఎం జిల్లాలు రద్దు చేస్తామని అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు.. జిల్లాలు రద్దు చేస్తే ప్రజలు ఊరుకుంటారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల రోజుల్లోనే కాంగ్రెస్ పాలనపై వ్యతిరేకత మొదలైంది అని కేటీఆర్ పేర్కొన్నారు.

# భారత్ ఓ విశ్వామిత్ర ..విశ్వాసపాత్ర: ప్రధాని మోడీ



గాంధీనగర్ : ప్రపంచవ్యాప్త అనిశ్చితత, కీలక సవాళ్ల నడుమ భారతదేశం దీపస్తంభంగా నిలిచిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. ఈ అద్భుత ఘట్టంతో ప్రపంచం అంతా ఇప్పుడు భారత్ వైపు చూస్తోందని, పలు దేశాలకు ఇండియా ఇప్పుడు ప్రగతి ఛోదకం, విశ్వసనీయ స్నేహం, సుస్థిరతల పునాదిగా మారిందని పేర్కొన్నారు. వెరసి భారతదేశం ఇప్పుడు ప్రపంచ స్థాయిలో ఏ కోణంలో చూసినా 'విశ్వామిత్ర' పాత్రకు చేరుకొంటోందని స్పందించారు. స్వరాష్ట్రం గుజరాత్‌లో ప్రధాని మోడీ 10వ వైబ్రెంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్‌ను ఉద్దేశించి ప్రారంభోత్సవ ఉపన్యాసం చేశారు. పలు క్లిష్టతల మధ్య ప్రపంచంలో కొన్నేళ్లుగా అలుముకున్న కారుమబ్బుల నడుమ భారతదేశం కాంతిపుంజం అయిందని తెలిపారు. భారతదేశం ఆర్థిక పురోగతి రికార్డు స్థాయిలో ఉంది. ప్రధాన రేటింగ్ ఏజెన్సీలన్నీ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. వీటి అంచనాల మేరకు వచ్చే కొద్ది సంవత్సరాల్లోనే భారతదేశం ప్రపంచంలోనే భారతదేశం అతి పెద్ద మూడు ఆర్థిక శక్తివంత దేశాలలో ఒక్కటి అవుతుందని ప్రధాని వివరించారు. పలు దేశాధినేతలు, ప్రముఖ కంపెనీల సిఇఓలు పాల్గొనే వైబ్రెంట్ గుజరాత్ స్థానికంగా మరిన్ని పెట్టుబడులు , వ్యాపారాల ఏర్పాటుకు ఉద్దేశించింది. అత్యంత శరవేగంగా ప్రపంచ వ్యవస్థ సుడులు తిరుగుతూ మారుతోంది. ఈ దశలో భారతదేశం తన విశిష్టతను సాధించుకుంది. విశ్వామిత్ర పేరు సార్థకం చేసుకుంది. అయితే ఇది అంత తేలిగ్గా దక్కిన గుర్తింపు కాదు. ఇందుకు మనం వారసత్వ సంపదగా ఎంచుకున్న అంకితభావం, కష్టించేతత్వం, సంక్షేమ సమిష్టిత్వం వంటివి భారత్‌కు ప్రత్యేకతలను ఆపాదించాయని వివరించారు. వీటితోనే భారత్ ఇప్పుడు గ్రోత్ ఇంజిన్ అయిందని, పలు దేశాలు ఈ విశ్వసనీయ సారధ్య పాటవాన్ని ఆదరిస్తున్నాయని ప్రధాని తెలిపారు. ప్రజా కేంద్రీకృతిక ప్రగతిని మనం పాటిస్తాం, గ్లోబల్ సౌత్‌కు గొంతుక అయ్యామని , ఇదే దశలో ప్రపంచస్థాయి ప్రగతి ఛోదక పాత్ర పోషిస్తున్నామని, దీనిని ఇన్వెస్టర్లంతా పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అన్నింటికి మించి భారతీయ యువత ప్రతిభాపాటవాలతో సాంకేతిక క్లిష్టతలకు పరిష్కారాలు దొరుకుతున్నాయి. ఈ విధంగా మన దేశం ప్రతిభాయుత యువత పవర్‌హౌస్ అయిందని మోడీ తెలిపారు . ప్రపంచస్థాయిలో సత్ఫలితాల సాధన దిశలో ఉన్న ప్రజాస్వామిక శక్తిగా మారిందని ఇది ఆద్యంతం అంతా గుర్తించాల్సిన విషయం అని ప్రధాని పేర్కొన్నారు.

ప్రగతి అంచనాల నివేదికలు చూడండి

అంతర్జాతీయ స్థాయి రేటింగ్ ఏజెన్సీలే భారతదేశం ఏదైనా సాధించగలదని చెపుతున్నాయని, ఈ విధంగా పలువురి పెట్టుబడులకు ఇదే తిరుగులేని గ్యారంటీ అవుతుందని ప్రధాని వివరించారు. త్వరలోనే భారతదేశం మూడు అతిపెద్ద ఎకనామి దేశాలలో ఒక్కటవుతుంది. ఈ గ్యారంటీని ప్రాతిపదికగా చేసుకుని ముందుకు రావాల్సి ఉందని ఇన్వెస్టర్లకు ఆయన పిలుపునిచ్చారు. భారతదేశం ఎప్పుడూ జియో జినోదే సూత్రం పాటిస్తుందని, మన లక్షాలను నెరవేర్చుకోవడంతో పాటు ప్రపంచ స్థాయి ఉమ్మడి ఆలోచనలపై కూడా మనం దృష్టి సారించడం జరుగుతోంది. 140 కోట్ల జనాభాగల భారతదేశపు ప్రాధాన్యతాక్రమాలను, ఆలోచనలను ప్రపంచం అంతా ఆసక్తిగా తిలకిస్తోంది. భారతదేశం ప్రజా కేంద్రీకృత ప్రగతి దిశలో సాగుతున్నందున పెట్టుబడులకు విశ్వసనీయమైన గ్యారంటీ ఉంటుందని ప్రధాని తెలియచేశారు. ఈ సమ్మిట్‌కు ముఖ్య అతిధిగా విచ్చేసిన యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్ అధ్యక్షులు మెహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌కు ప్రధాని మోడీ అభినందనలు తెలిపారు. ఇండో యుఎఐ సత్సంబంధాలలో ఇదో మరో మైలురాయి అవుతుందన్నారు. సదస్సులో ప్రముఖ పారిశ్రామిక వేత్త ముఖేష్ అంబానీ కూడా పాల్గొన్నారు. భారతదేశానికి అత్యంత సమర్థుడైన ప్రధానిగా మోడీ పేరు తెచ్చుకున్నారని కొనియాడారు.

స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్
SNEHA MACS | SNEHA CLUB | PAY BACK TO SOCIETY | SNEHA GROUP OF ORGANISATIONS 23 YEARS CELEBRATIONS
(Regd. No.AMC/VSP/DCO/2008/2446 Dated 07-03-2008)
BENEFITS
- Safe and confidential
- High rate of Interest On Deposits
- No Income Tax deduction on Interest Payment
- Financial growth to all
- Support Your Business
- Easy Sanction of loan to share holders
- Dividend paid to the Share holders (since 10 Years)

Schedule of Interest Rates on Fixed & R.D.Accounts

| Term | | General | Senior Citizens |
|---|---|---|---|
| 91 Days | - 179 Days | 8.25% | 8.75% |
| 180 Days | - 1 Year | 9.25% | 9.75% |
| 1Year | - 2 Years | 10.25% | 10.50% |
| 2 Years | - 3 Years | 10.50% | 10.75% |
| 3 Years | - 5 Years | 11.00% | 11.50% |
| Above 5 Years | | 12.00% | 12.50% |
| Saving Bank A/C | | 5.00% | 5.00% |
| Recurring deposit | | 6.00% | 6.50% |

Money Multiplier Scheme
Your valuable money is Double in 7 Years
Minimum 10,000/- and above
SPS
సంవత్సరానికి 11.00%వడ్డీ ఇవ్వబడును. మీ డిపాజిట్ పై లభించే వడ్డీ
రూ. 1,00,000/- రూ. 11,000/-
రూ. 5,00,000/- రూ. 55.000/-
రూ. 10,00,000/- రూ. 1,10,000/- *షరతులు వర్తిస్తాయి
ఆంధ్రప్రదేశ్ : విశాఖపట్నం : 0891-2791205,9246663046,7660027696 చింతలపూడి : 7660027675
తెలంగాణ : హైదరాబాద్ : 040-23233989, 7660027682 పొన్నూరు : 9618444604
ఆంధ్రప్రదేశ్ : డోర్.నెం.50-61-3, సీతంపేట, రాజేంద్రనగర్, విశాఖపట్నం-530016
తెలంగాణ : డోర్.నెం. 6-29÷3,మూడవ అంతస్తు , దౌలత్‌ప్లాజ, లక్డీకాపూల్, హైదరాబాద్-500 004.
E-mail:snehamacsltd@gmail.com

# తగ్గనున్న జిల్లాలు..

హైదరాబాద్, జనవరి 10,ప్రజాపాలన ప్రతినిధి: తెలంగాణలో మళ్లీ జిల్లాల పునర్వ్యవస్థీకరణ అంశం తెరపైకి వచ్చింది. గత బీఆర్ఎస్ సర్కార్ రాజకీయ అవసరాల కోసం పది జిల్లాలో ఏర్పడిన తెలంగాణలో పాత జిల్లాలను చలువలు పలువలుగా చీల్చేసింది. పదికి అదనంగా 23 జిల్లాలు.. మొత్తం 33 జిల్లాలుగా మార్చేసింది. ఇక రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటు కూడా అస్తవ్యస్తంగా జరిగింది. పదేళ్ల తర్వాత తెలంగాణలో తొలిసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై సమీక్ష చేయాలని భావిస్తోంది. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో కమిషన్ ఏర్పాటు చేయాలని భావిస్తోంది. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటులో జరిగిన లోపాలను సవరించి శాస్త్రీయంగా, పాలనా యోగ్యంగా జిల్లాలను విభజించాలని భావి స్తోంది.తెలంగాణను పదేళ్లు పాటించిన బీఆర్ఎస్ సర్కార్ పాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలన్న ఉద్దేశంతో జిల్లాల పునర్ వ్యవస్థీకరణ చేపట్టింది. పాత 10 జిల్లాలను ఇష్టానుసారంగా అశాస్త్రీయంగా




విభజించింది. కొడుకు కోసం ఒక జిల్లా.. బిడ్డ కోసం మరో జిల్లా.. తన లక్కీ నంబర్ కలిసి వచ్చేలా ఇంకో జిల్లా.. రాజకీయ అవసరాల కోసం కొన్ని.. ప్రతిపక్షాలను బలహీన పర్చేందుకు కొన్ని జిల్లాలు ఏర్పాటు చేశారు. వాస్తవానికి తెలంగాణలో అప్పటి వరకు 10 నుంచి 15 జిల్లాల డిమాండ్ మాత్రమే ఉంది. కానీ, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్? ఏళ్లుగా డిమాండ్ ఉన్న జిల్లాలతోపాటు.. తన రాజకీయ అవసరాలు, ఇతర కారణాలతో మరో ఎనిమిది జిల్లాలు కొత్తగా ఏర్పాటు చేశారు.ఇక జిల్లాలతోపాటు రెవెన్యూ డివిజన్లు, మండలాలను కూడా అశాస్త్రీయంగా విభజించారు. డిమండ్ లేకపోయినా కేవలం రాజకీయ అవసరాల కోసమే మండలాలను ఏర్పాటు చేశారు. తెలంగాణలో మొదట 37 రెవెన్యూ డివిజన్లు ఉండగా వాటిని 74కు పెంచారు. క మండలాలు 464 ఉండగా, వాటిని 607కు పెంచేశారు. నాలుగైదు గ్రామాలను కలిపి కూడా ఒక మండలం ఏర్పాటు చేసేశారు. ఇక జిల్లాల విషయానికి వచ్చేసరికి ఒకటిన్నర, రెండు నియోజకవర్గాలను కలిపి జిల్లాలు ఏర్పాటు చేశారు.ఇక తెలంగాణలో ఇన్‌చార్జి మంత్రుల వ్యవస్థను కూడా కేసీఆర్ సర్కార్ నిర్వీర్యం చేసింది. ఇద్దరు ఎమ్మెల్యేలకు ఒక జిల్లా అన్నట్లుగా జిల్లాలను విభజించిన కేసీఆర్ జిల్లా పరిషత్ మీటింగులు జరిగినా, జిల్లా సమీక్ష సమావేశాలు జరిగినా వాటికి ప్రాధాన్యం లేకుండా చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాలు కూడా రెండు మూడు జిల్లాల్లో కలిపి ఉండడంతో ఎమ్మెల్యే కూడా రెండు మూడు జిల్లాల్లో జరిగే సమావేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఇక మండలాలు రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసినా వాటికి సరిపడా భవనాలు లేవు, పాత భవనాల్లో, అద్దె భవనాలతో నెట్టుకొస్తున్నారు. సిబ్బంది అంతంతే. వీటిపై దృష్టిపెట్టిన కాంగ్రెస్ సర్కార్.. శాస్త్రీయంగా జిల్లాలను పునర్ వ్యవస్థీకరించేందుకు సిద్ధమవుతోంది.పది జిల్లాల తెలంగాణను సీఎం కేసీఆర్ లక్కీ నంబర్ 6 వచ్చేలా 33 జిల్లాలుగా మార్చేశారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ సర్కార్ శాస్త్రీయంగా పాలనా సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చేసే పునర్ వ్యవస్థీకరణలో ఎన్ని జిల్లాలు ఎగిరిపోతాయో.. మొత్తంగా ఎన్ని జిల్లాలు ఉంటాయి అన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఏపీలో మాదిరిగా పార్లమెంటు నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా మార్చుతారా లేక మరేదైనా విధానాన్ని ప్రామాణికంగా తీసుకుని జిల్లాలను పునర్ వ్యవస్థీకరిస్తారా అన్నది ఇప్పుడు హాట్ టాపిక్ అయింది.

## పట్టాలు తప్పిన చెన్నై-హైదరాబాద్ రైలు బోగీలు

**నాంపల్లి రైల్వే స్టేషన్ లో ఘటన**




హైదరాబాద్, హైదరాబాద్ నాంపల్లి రైల్వే స్టేషన్ లో ప్లాట్ పామ్ నెంబర్ 5 లో రైలు పట్టాలు తప్పింది. చెన్నై నుండి హైదరాబాద్ చేరుకునేటప్పుడు ఎస్ 3, ఎస్ 4, ఎస్ 6 బోగీలు పట్టాలు తప్పడం తో ప్రమాదం జరిగింది.ఘటనలో ప్రయాణికులకు గాయాలు అయినట్లు సమాచారం. రైల్వే అధికారులు, నాంపల్లి రైల్వే పోలీసులు, ఆర్పిఎఫ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు.

## ఇథనాల్ పరిశ్రమపై మాజీమంత్రి ఇంద్రకరణ్ వ్యాఖ్యలను ఖండించిన ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

నిర్మల్, ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుపై మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు దయ్యాలు వేదాలు వల్లించినట్లు గా ఉన్నాయని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. నిర్మల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఇథనాల్ పరిశ్రమ రద్దయ్యేవరకు స్థానిక రైతులు ప్రజలతో కలిసి ప్రభుత్వంతో సైతం పోరాటాలు చేస్తామన్నరు. సిర్గాపూర్ గ్రామం వద్ద షుగర్ ఫ్యాక్టరీ పేరుతో రైతుల వద్ద నుండి భూములు లాక్కున్న ఘనత మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిదేనన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీ కి అనుమతులు ఇవ్వలేదని బహిరంగంగా ప్రకటించే దమ్ముందా అని ప్రశ్నించారు, ఈ విషయమై బహిరంగ చర్చకు నేను సిద్ధంగా ఉన్నానని ఇంద్రకరణ్ రెడ్డికి సవాల్ విసిరారు. ఫ్యాక్టరీ పై రైతులతో సంబంధిత శాఖల మంత్రులను కలిసి ఫ్యాక్టరీ రద్దుకు కృషి చేస్తా హామీ నిచ్చారు.

# లోకసభ బరిలో గులాబీ ఫ్యామిలీ



హైదరాబాద్, జనవరి 10,ప్రజాపాలన ప్రతినిధి: బీఆర్ఎస్.. తెలంగాణలో ముచ్చటగా మూడోసారి గెలిచి.. జాతీయ రాజకీయాల్లోనూ చక్రం తిప్పాలని కలలు కన్న పార్టీ. ఇందుకోసం పార్టీ పేరునే మర్చుకుంది. పదేళ్ల తెలంగాణలో అధికారంలో ఉంది. కుటుంబ పాలన, అహంకార పూరిత ధోరణితో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను ఇంటికి పంపించారు. పదేళ్లు ఓటమంటూ ఎరగని పార్టీకి.. తాజా ఓటమి మింగుడు పడడం లేదు. ప్రధానంగా పార్టీ పరిస్థితి ఏంటో కూడా అర్థం కాని పరిస్థితి నెలకొంది. విశ్లేషకులు ముందుగా అంచనా వేసినట్లే అంతా జరుగుతోంది. జాతీయ రాజకీయాలు ఏంటోగానీ, తెలంగాణలో ఆ పార్టీ ఉనికే ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పుడు ఈ టెన్షనే గులాబీ బాస్ కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన మూడు నెలలకే లోక్‌సభ ఎన్నికలు రాబోతున్నాయి. మరో 40 రోజుల్లో నోటిషికేషన్ వచ్చే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ ఇప్పటికే ఎన్నికలకు సమాయత్తం అవుతున్నాయి. దీంతో అప్రమత్తమైన గులాబీ పార్టీ కూడా అసెంబ్లీ ఎన్నికల్లో పోయిన పరువును.. లోక్‌సభ ఎన్నికల్లో నిలబెట్టుకోవాలని భావిస్తోంది. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికల ప్రభావం వచ్చే లోక్‌సభ ఎన్నికలపై పడకుండా ఉండేందుకు పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సమీక్షలు నిర్వహిస్తున్నారు. నిరాశలో ఉన్న గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన తప్పులను, చేసిన పొరపాట్లను ఒప్పుకుంటున్నారు. లోక్‌సభ ఎన్నికలకు కార్యోన్ముఖులను చేస్తున్నారు. ఒక్క ఓటమి బీఆర్ఎస్‌కు అనేక సమస్యలు సృష్టించడంతోపాటు కేసీఆర్ కుటుంబంలోనే చిచ్చురేపాయని గులాబీ భవన్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. కేడర్‌లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే మాజీ మంత్రి హరీశ్‌రావు రెండు రోజుల క్రితం తెలంగాణ భవన్‌లో కీలక ప్రకటన చేశారు. కేసీఆర్ వేగంగా కోలుకుంటున్నారని, ఫిబ్రవరి నుంచి తెలంగాణ భవన్‌కు వస్తారని తెలిపారు. పార్టీ వ్యవహారాలన్నీ ఆయనే చూసుకుంటారని వెల్లడించారు. జిల్లాల పర్యటన కూడా చేస్తారని తెలిపారు. అంటే కేటీఆర్‌ను ఇక పక్కకు పెడతారా అన్న చర్చ జరుగుతోంది.ఇదిలా ఉంటే.. కేసీఆర్ పార్టీ గురించి పట్టించుకోవడం ఎప్పుడో మానేశారు. మొత్తం కేటీఆర్‌కే అప్పగించారు. ఈ క్రమంలో హరీశ్‌రావు కేసీఆరే పార్టీ వ్యవహారాలు చూసుకుంటారని ప్రకటన చేయడం కేసీఆర్ కుటుంబంలో గొడవలు మొదలయ్యాయని జరుగుతున్న ప్రచారానికి బలం చేకూరుస్తుంది. ఇప్పటికే కేసీఆర్ ఎంపీగా పోటీ చేయాలని డిసైడ్ అయ్యారు. ఈ క్రమంలో కేటీఆర్ కూడా లోక్‌సభ బరిలో నిలవాలని భావిస్తున్నారు. ఈమేరకు సంకేతాలు ఇస్తున్నారు. ఇక కవిత ఎలాగూ పోటీకి సిద్ధమవుతోంది. దీంతో కుటుంబంలో ముగ్గరికి ముగ్గురూ లోక్‌సభపైనే గురిపెట్టినట్లు తెలుస్తోంది.వాస్తవానికి ముగ్గరూ రాష్ట్ర రాజకీయాలను విడిచే అవకాశం ఉండదు. కానీ, కేటీఆర్ ఎందుకు లీక్ ఇచ్చారన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇప్పటి వరకు కేటీఆర్ పార్టీ రాష్ట్ర వ్యవహారాలు చూసుకుంటున్నారు. కవిత జాతీయ రాజకీయాలపై ఫోక్ చేస్తున్నారు. కానీ, ఇప్పుడు కేటీఆర్ అనూహ్యంగా లోక్‌సభ బరిలో ఉంటానని లీక్ ఇవ్వడం, ఇదే సమయంలో కేసీఆర్ పార్టీ వ్యవహారాలు చూసుకునేందుకు వస్తారని హరీశ్‌రావు ప్రకటించడం బీఆర్ఎస్ భవన్‌లో చర్చకు దారితీశాయి. కేసీఆర్ కుటుంబంలో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై గొడవ జరుగుతోందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

# గాజుల కానుక... ప్రచారం



ఖమ్మం, జనవరి 10,ప్రజాపాలన ప్రతినిధి: తెలుగు రాష్ట్రాల్లో సరికొత్త ప్రచారం పుట్టుకొచ్చింది. మూఢ నమ్మకాలను తొందరగా విశ్వసించే ప్రజలు ఒక కొత్త విశ్వాసాన్ని తెరపైకి తెచ్చి ఆచరిస్తున్నారు. ఆచరించడమే కాదు.. అందరూ ఆచరించేలా "మౌత్ టాక్"తో తెలంగాణ అంతటా వెలుగులోకి తెచ్చారు. అదేంటో తెలుసా? దాని పేరే "గాజుల కానుక". ఇప్పుడు ఈ గాజుల కానుక ప్రచారం ఎవరి నోట చూసినా వినిపిస్తుంది. ఇద్దరు కొడుకులు ఉన్న మహిళల వద్ద ఒక్క కొడుకు ఉన్న మహిళలు డబ్బులు అప్పుగా తీసుకోవాలాట. ఆ డబ్బులతో ఐదు రకాల గాజులను కొనుగోలు చేసి వాటిని చేతికి వేసుకోవాలట. అప్పుడు వారికి ఎలాంటి కీడు ఉండదట. సంక్రాంతి పండుగ సమీపిస్తున్న వేళ ఈ నయా మూఢ నమ్మకం ట్రెండింగ్ లోకి వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా మహిళల నోళ్లలో నానుతున్న ఈ నయా సంప్రదాయం ఫాలో కాని పక్షంలో కీడు జరుగుతుందనే ప్రచారం ఊపందుకుంది.మూఢ నమ్మకాలను బాగా విశ్వసించే జనం కొందరు అదే పనిగా దీన్ని ఆచరిస్తూ తమ చుట్టు పక్కల ప్రజలకు కూడా తెలియజెబుతున్నారు. అందరూ ఈ ట్రెండ్ ను ఫాలో అయ్యేలా కొందరు పనిగట్టుకుని ఫోన్లు చేస్తూ ఆచరించేలా చేస్తున్నారు. దీంతో తెలంగాణలో ఎక్కడ చూసినా ఆడపడుచుల గాజుల వ్యవహారమే చర్చనీయాంశంగా మారింది. ఈ మూఢ నమ్మకం పుణ్యమాని గాజుల దుకాణదారులకు భలే గిరాకీ తగిలింది. గాజులకు కూడా డిమాండ్ బాగా పెరిగింది. ఇదిలా ఉండగా ఈ ప్రచారాన్ని కొట్టి పారేస్తున్నారు కొందరు నిపుణులు. ఇలాంటి మూఢ నమ్మకాలను నమ్మొద్దని సూచిస్తున్నారు. గాజులు వేసుకున్నంత మాత్రాన వచ్చేదీ లేదు.. వేసుకోకపోతే జరిగేదీ ఏం ఉండదని చెబుతున్నారు. ఈ పోటీ ప్రపంచంలో ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలే తప్ప మూఢ విశ్వాసంతో కాదని నొక్కి వక్కాణిస్తున్నారు. ఏదేమైనా ట్రెండ్ ఫాలో అవ్వాల్సిందే అంటున్నారు మహిళామణులు.లంగాణలో ఒక ప్రచారం వైరస్ లా వ్యాపించింది. ఒక్క కొడుకు ఉన్న మహిళ చేతినిండా ఐదు రకాల గాజులు ధరించాలని, లేకుంటే ఒక్కగానొక్క కొడుకుకు ఇబ్బంది కలుగుతుందని కొందరు ప్రచారం చేశారు. ఈ ప్రచారాన్ని నమ్మిన మహిళలు గాజుల దుకాణాలకు క్యూ కట్టారు. పైగా ఒక షరతు పెట్టారు. ఇద్దరు మగబిడ్డలున్న మహిళల నుంచే గాజులు తీసుకోవాల్సి ఉంటుందని చెప్పడంతో ఇద్దరు మగబిడ్డలున్న మహిళల చెంతకు వెళ్లి వారిని అభ్యర్థిస్తున్నారు. మట్టి గాజుల కొనుగోళ్లు విపరీతంగా పెరిగాయి. సంక్రాంతి దినాలు కీడురోజులుగా భావించి ఒక మగబిడ్డ ఉన్న మహిళ ఖచ్చితంగా ఐదు రకాల గాజులను రెండు చేతులకు ధరించాలని చెప్పడంతో గాజుల దుకాణాలకు గిరాకీ పెరిగింది.అయితే దీనిని పిచ్చి చర్యగా కొట్టిపారేస్తున్నారు. ఎలాంటి అరిష్టం లేదని పండితులు చెబుతున్నారు. అయినా వినకుండా టీవీలు, సామాజిక మాధ్యమాల్లో చూసిన మహిళలు మాత్రం మట్టి గాజులే కదా? వేసుకుంటే ఏం పోతుంది? అన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. వారిలో ఉన్న భయాన్ని కొందరు సొమ్ము చేసుకునే ప్రయత్నంలోనే భాగంగానే ఈకొత్త కాన్సెప్ట్ ను బయటకు తీసుకువచ్చారన్న వాదన కూడా లేకపోలేదు. ఎవరూ భయపడాల్సిన పనిలేదని, ఒక్క కొడుకు ఉన్నప్పటికీ గాజులు వేసుకోకున్నా అరిష్టం ఏమీ ఉండదని, చెడు జరగదని మాత్రం పండితులు సూచిస్తున్నారు.

# గ్యారంటీల స్టేటస్ చెక్ ఇలా




హైదరాబాద్, జనవరి 10,ప్రజాపాలన ప్రతినిధి: తెలంగాణలో కాంగ్రెస్ అధికా రంలోకి రావడానికి ఆ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలు దోహదం చేశాయి. మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందరిమ్మ ఇళు?ల, రైతు భరోసా, చేయూత, యువవికాసం పేరుతో నాడు టీపీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్‌రెడ్డి హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ప్రకటించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో విసిగిపోయి ఉన్న తెలంగాణ ప్రజలకు ఆరు గ్యారంటీలు ఆశాదీపంలా కనిపిం చాయి. ఇం కేముంది.. బీఆర్ఎస్‌ను గద్దె దించి.. కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చారు. డిసెంబర్ 7న కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. సీఎంగా రేవంత్ బాధ్యతలు చేపట్టారు. దీంతో ఎన్నికల ముందు ఇచ్చిన గ్యారెంటీల అమలుపై కసరత్తు ప్రారంభించింది. డిసెంబర్ 9న ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభించారు. ఈ క్రమంలో మరో ఐదు గ్యారంటీల అమలుకు డిసెంబర్ 28న రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజల వద్ద నుంచి ఐదు గ్యారంటీలకు దరఖాస్తులు స్వీకరించింది. రాష్ట్ర వ్యాప్తంగా 1.25 కోట?ల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఐదు గ్యారంటీలకు సుమారు కోటి దరఖాస్తులు రాగా, మరో 25 లక్షల దరఖాస్తులు గ్యారంటీల్లో లేని సమస్యలపై వచ్చాయని ప్రభుత్వం ప్రకటించింది. ఈ దరఖాస్తులను అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. జనవరి 17 నాటికి ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో రాత్రి, పగలు తేడా లేకుండా అధికారులు ఆన్‌లైన్ నమోదు విధులు నిర్వర్తిస్తున్నారు.ఐదు గ్యారెంటీలకు దరఖాస్తు చేసుకున్న వారంతా తమ దరఖాస్తు అప్రూవ్ అయిందా, రిజక్ట్ అయిందా తెలియక టెన్షన్ పడుతుంటారు. చాలా మంది ఈ సందేహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో అప్లికేషన్ స్టేటస్ తెలుసుకునే అవకాశాన్ని కూడా ప్రభుత్వం కల్పించింది. ఇందుకోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందిస్తోంది. అభయహస్తం పథకం కింద దరఖాస్తులు ఇచ్చిన వారంతా తమకు ప్రజాపాలన కార్యక్రమంలో ఇచ్చిన రశీదు పత్రంలోని దరఖాస్తు నంబర్ నోయువర్ అప్లికేషన్ స్టేటస్ వెబ్‌సైట్‌లో ఎంటర్ చేసి అప్లికేషన్ స్టేటస్ చెక్ చేసుకుంటే సరిపోతుంది. తర్వాత వ్యూ స్టేటస్ క్లిక్ చేయాలి. వెంటనే దరఖాస్తు అప్రూవ్ అయిందా లేక రిజక్ట్ అయిందా అనే తెలిసిపోతుంది.

# మేడారం జాతరకు వేగంగా పనులు

వరంగల్, జనవరి 10,ప్రజాపాలన ప్రతినిధి: తెలంగాణ కుంభమేళాగా ప్రతిద్ధి చెందిన మేడారం సమ్మక్క ? సారమ్మ మహాజాతర తేదీలు ఖరారయ్యాయి. రెండేళ్లకోసారి ఆదివాసీ, గిరిజన సంప్రదాయ పద్ధతిలో నిర్వహించే ఈ జాతరను ఈసారి 2024, ఫిబ్రవరి 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించాలని పూజారుల సంఘం నిర్ణయించింది. ఈ మేరకు షెడ్యూల్‌ను ప్రకటించారు. ఫిబ్రవరి 14న మాఘశుద్ధ పంచమి బుధవారం రోజు మండెమెలగడం, గుడి శుద్ధీకరణతో జాతర ప్రక్రియను ప్రారంభించాలని నిర్ణయించారు.మేడారం మహాజాతర తేదీలను పూజారులు ఈసారి పది నెలల ముందే ఖరారు చేశారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ ఉన్నతాధికారుల సూచన మేరకు తేదీలను ముందుగానే ప్రనకటించారు. గత అనుభవాల దృష్ట్యా ఈసారి జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసింది.మేడారం మహాజాతర తేదీల ఖరారు కోసం పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ఉపాధ్యక్షుడు కాక సారయ్య, ప్రధాన కార్యదర్శి చందా గోపాల్, పూజారులు సిద్దబోయిన మునేందర్, సిద్దబోయిన మహేశ్, లక్ష్మణ్‌రావు, కాక వెంకటేశ్వర్లు, కాక భుజంగరావు, చందా రఘుపతి, కొక్కెర కృష్ణయ్య, కొక్కెర రమేశ్, భోజారావు, జనార్దన్, అరుణ్‌కుమార్‌లు సమావేశం అయ్యారు. మహా జాతర తేదీలను ప్రకటించే ముందు పూజారులు ఆనవాయితీ ప్రకారం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాజాతర విజయవంతంగా సాగాలని అమ్మవార్లను వేడుకున్నారు.

**జాతర తేదీలు ఇవే..**

ఫిబ్రవరి 21 : మాఘశుద్ధ ద్వాదశి బుధవారం సాయంత్రం గద్దెల మీదకు సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల రాక, ఫిబ్రవరి 22 : చిలకలగుట్ట నుంచి సమ్మక్క దేవత రాక.ఫిబ్రవరి 23 : సమ్మక్క?సారలమ్మ అమ్మవార్లకు మొక్కుల సమర్పణ.ఫిబ్రవరి 24 : మాఘశుద్ధ పౌర్ణమి శనివారం అమ్మవార్ల వన ప్రవేశంతో మహా జాతర ముగింపు.ఫిబ్రవరి 28 : మాఘశుద్ధ బహుళ పంచమి బుధవారం రోజు తిరుగువారం పండుగ నిర్వహిస్తారు

## సా మిల్ లో భారీ అగ్ని ప్రమాదం

జగిత్యాల:ప్రజాపాలన ప్రతినిధి:జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది కోరుట్ల పట్టణంలోని గడిబురుజు వద్ద సుఫియా అనే కట్టే మిషన్లో బుధవారం తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు చెలరేగాయి, చుట్టుపక్కల వాళ్ళు గమనించి చేరుకునే లోపు కట్ట మిషన్ లో ఉన్న విలువైన వస్తువులు కట్టెలు పూర్తిగా కాలిపోయాయి. ఎప్పటిలాగే రాత్రి 11 గంటల సమయంలో సామెల్కు తాళం వేసి వెళ్లారు అయితే షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందో లేక ప్రమాదవశాత్తు నిప్పంటుకుందో తెలియదు కానీ భారీగా మంటలు చెడరేగడంతో భారీ ఎత్తున నష్టం వాటిల్లింది. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు కోటి రూపాయల వరకు ఆస్తి నష్టం వాటిలినట్లు తెలుస్తోంది. టేకు కర్ర అలాగే విలువైన సామాగ్రి ఉండడంతో అవి పూర్తిగా కాలిపోయాయి, ఫైర్ స్టేషన్కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికీ పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. సామిల్ కు మంటలు అంటుకోవడంతోపాటు సామిల్ పక్కన ఉన్న రెండు మూడు ఇళ్లలో కూడా మంటలు వ్యాపించాయి. అయితే అప్రమత్తమైన అక్కడివారు బయటకు వెళ్లడంతో ప్రమాదం తప్పింది.

## జంపు జిలానీలపై పిర్యాదు

### సమర్థించిన ఎమ్మెల్యే అనిల్

నెల్లూరు :ప్రజాపాలన ప్రతినిధి: వైసిపి గుర్తుతో, వైసిపి బీఫామ్ తో గెలిచిన శాసనసభ్యులు..నేడు వైసిపిని వీడి టిడిపిలో చేరిన కారణంతోనే వారిపై అర్హత వేటు వేయాలని శాసనసభ స్పీకర్ కు ఫిర్యాదు చేయడం జరిగిందని మాజీ మంత్రి,నెల్లూరు నగర శాసనసభ్యుడు పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. శాసనసభ్యులపై అర్హత వేటుకు వైసిపి అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని. తాము చేసిన ఫిర్యాదు పై మెరిట్స్, డీ మెరిట్స్ ను పరిశీలించి శాసనసభ స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. టిడిపి శాసనసభ్యులు ఎవరు తమ పార్టీలో చేరలేదని..తమ పార్టీ కండువా కప్పుకున్న దాఖలాలు ఎక్కడా లేవని వ్యాఖ్యానిస్తూ..టిడిపికి దగ్గరైన వైసిపి ఎమ్మెల్యేలు టిడిపి కండువాలు కప్పుకున్నారు. ఆ పార్టీ కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. కనుకనే అధిష్టానం అలాంటి నిర్ణయం తీసుకోవడం జరిగిందని స్పష్టం చేశారు.

## లారీ బీభత్సవం.. తప్పిన పెను ప్రమాదం

వికారాబాద్ :ప్రజాపాలన ప్రతినిధి: అదుపు తప్పిన లారీ బీభత్సం సృష్టించింది. సిమెంటు లోడ్ తో ఉన్న లారీ రెండు ద్విచక్ర వాహనాలు, ఒక కారు , ప్రహరీ గోడకు ఢీకొంది.ప్రయాణికులు భయభ్రాంతులకు గురైయారు. అదృష్టవశాత్తూ వాహనాలపై ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలో సంఘటన జరిగింది. స్కూల్ కు వెళ్లే సమయంలో జరగడంపై ప్రయాణికులు అంతా భయభ్రాంతులకు గురయ్యారు.

## గ్రాడ్యుయేట్స్ అందరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి: తాహాసిల్దార్ వెంకటేశ్వర్లు



మధిర రూరల్ జనవరి 10 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో తహసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ మాట్లాడుతూఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు కొరకు ఆన్ లైన్ ద్వారా కావలసిన సర్టిఫికెట్స్ డిగ్రీ మేమో ఒరిజినల్ఓటర్ ఐడి కార్డుపాస్ ఫోటో ఆధార్ కార్డుఆన్ లైన్ ద్వారా మాత్రమే కావలసినవిఎమ్మెల్సీ ఓటుకు అర్హులైన వారు1-112023 నాటికి డిగ్రీ అయిపోయి ఉండాలి.దీనికి ముందు ఓటు హక్కును కలిగి ఉన్న వారు కూడా ఆన్లైన్ ద్వారా ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకుని వలెను ఆయన తెలిపారు

## రైమండ్స్ కే ఎన్ ఫ్యాషన్ వస్త్రాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





మేడిపల్లి, జనవరి 10 (ప్రజాపాలన ప్రతినిధి) :హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 8 లో రైమండ్స్ కే ఎన్ ఫ్యాషన్ నూతన వస్త్రాలయా ప్రారంభోత్సవ కార్యక్రమానికి నిర్వాహకులు అమిత్ రెడ్డి, సురేష్ గౌడ్ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథులుగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొని వారి చేతులమీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి పూజ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం నిర్వాహకులు అమిత్ రెడ్డి, సురేష్ గౌడ్ మాట్లాడుతూ కష్టమైస్డ్ టైలరింగ్ సదుపాయంతో డ్రెస్ మెటీరియల్, రెడీమేడ్ డ్రెస్సెస్ నాణ్యతతో కూడిన డ్రెస్ స్టిచ్చింగ్ మెటీరియల్ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుల్ను డాక్టర్ చారి, సోమిరెడ్డి, కలేరు జై నవీన్, నరసింహారెడ్డి, సంజయ్ జెన్ పాల్గొన్నారు.

## ఓటు లాంటిది ఇంకొకటి లేదు - నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను

### జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



ప్రజాపాలన, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 10 : ఈ 25వ తేదీన 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో ఓటరు దినోత్సవ వేడుకలను అన్ని శాఖల సమన్వయంతో ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. 14వ జాతీయ ఓటరు దినోత్సవంలో "ఓటు లాంటిది ఇంకొకటి లేదు – నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను" అనే నినాదంతో గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా వివిధ రకాల కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్య పరచడం జరుగుతుందని తెలిపారు. ఓటరు దినోత్సవ సంబంధిత పోస్టర్లు, బ్యానర్లు, ప్రసార మాధ్యమాలు, ప్రచార కార్యక్రమాల ద్వారా జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారులు పరిధిలో విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలో ఆడియో, వీడియో సందేశాల ద్వారా రాబోవు ఎన్నికలలో తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఓటరు దినోత్సవ నినాదాన్ని ప్రతిబింబించేలా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్లను ఓటు వేసేలా ప్రోత్సహిస్తూ వారిని స్ఫూర్తిదాయంగా చూపించడం జరుగుతుందని, బ్యాంకులు, పోస్టాఫీసులు, రైల్వే, పంచాయతీరాజ్ ఇతరత్రా శాఖల సమన్వయంతో, కార్పొరేట్ సంస్థలు, సొసైటీల ఆధ్వర్యంలో వ్యాసరచన, ఉపన్యాసం, వెబినార్, సెమినార్ల ద్వారా ప్రజలందరికీ తెలిసేలా ఓటు ఆవశ్యకతను వివరించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ శాఖలు వారి కార్యాలయంలో ఓటరు ప్రతిజ్ఞ చేసి సంబంధిత సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేపట్టాలని తెలిపారు. ఓటరు దినోత్సవ సంబంధిత కారక్రమాలను కొవిడ్ నిబంధనలను పాటిస్తూ పోలింగ్ కేంద్రం స్థాయి నుండి చేపట్టాలని, నూతనంగా నమోదు కాబడిన ఓటర్లను గుర్తించి వారిని సన్మానించి, ఓటరు గుర్తింపు కార్డులను అందించడం జరుగుతుందని, ప్రాంతీయ భాషలో ఈ.వి.ఎం., వి.వి. ప్యాట్, పోస్టల్ బ్యాలెట్, పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలు, హెల్ప్లైన్ యాప్, ఓటు విలువ తదితర అంశాలపై ప్రజలకు అర్థమయ్యే రీతిలో వీడియోలు రూపొందించి ప్రదర్శించడం జరుగుతుందని, దినపత్రికలు, ఛానళ్ళు, హోర్డింగుల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్న జాతీయ ఓటరు దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అందరు కలిసి రావాలని కోరారు.

## ఈ నెల 24వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలి

### జిల్లా కార్మిక శాఖ సహాయ కమీషనర్ వినీత

ప్రజాపాలన, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 10, :కార్మిక శాఖ పరిధిలో నిర్వహించబడుతున్న ఈ-శ్రమ్ పోర్టల్లో నమోదు కాబడిన అసంఘటిత రంగ కార్మికులు నష్టపరిహారం పొందేందుకు ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కార్మిక శాఖ సహాయ కమీషనర్ వినీత ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం ఆగస్టు 26, 2021న ఈ-శ్రమ్ పోర్టల్ ప్రారంభించడం జరిగిందని, ఇందులో నమోదు కాబడిన కార్మికులకు ప్రమాద భీమా వర్తిస్తుందని తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు 2 లక్షల రూపాయలు, ప్రమాదంలో అంగవైకల్యం కలిగిన వారికి 2 లక్షల రూపాయలు, పాక్షిక అంగవైకల్యం కలిగిన వారికి 1 లక్ష రూపాయలు అందించడం జరుగుతుందని తెలిపారు. మార్చి 31, 2022 కంటే ముందు ఈ-శ్రమ్ పోర్టల్లో నమోదు చేసుకున్న వారిని నష్టపరిహారం పొందేందుకు అర్హులుగా పరిగణించడం జరుగుతుందని, నిబంధనల మేరకు పరిహారం అందించడం జరుగుతుందని తెలిపారు. మృతి చెందిన వారి కుటుంబాలు నష్టపరిహారం పొందేందుకు దరఖాస్తుదారు ఆధార్కార్డు, యు.ఎ.ఎన్. కార్డు, మరణ ధృవీకరణ పత్రం, మృతి కారణాన్ని నిర్ధారించే మెడికల్ సర్టిఫికెట్, ఎఫ్.ఐ.ఆర్., పంచనామా, పోస్టుమార్టం నివేదిక సమర్పించవలసి ఉంటుందని తెలిపారు. అంగవైకల్యం పొందినట్లయితే ఆధార్కార్డు, యు.ఎ.ఎన్. కార్డు, వైకల్యాన్ని నిర్ధారించే ఆసుపత్రి రికార్డు, ప్రభుత్వంచే గుర్తించబడిన సంస్థల నుండి జారీ చేయబడిన దివ్యాంగత్వ ధృవీకరణ పత్రం, సంబంధిత ప్రభుత్వ శాఖచే జారీ చేయబడిన దివ్యాంగ గుర్తింపు కార్డు సమర్పించవలసి ఉంటుందని తెలిపారు. నష్టపరిహారం పొందేందుకు సంబంధిత అభ్యర్థులు ఈ నెల 24వ తేదీలోగా సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని 2వ అంతస్తులో ఎస్-8లో గల జిల్లా కార్మిక శాఖ సహాయ కమీషనర్ కార్యాలయంలో దరఖాస్తుతో పాటు సంబంధిత ధృవపత్రాలు జతపరిచి అందజేయాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## ప్రతినిత్యం ప్రజా సేవలో ఉంటా

### కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్



కుత్బుల్లాపూర్, జనవరి 10, ( ప్రజాపాలన ) : ప్రతినిత్యం ప్రజా సేవలో ఉంటానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ను కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద మర్యాద పూర్వకంగా కలిసి 2024 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్ లను ఆవిష్కరించారు. అదే విధంగా పలు కాలనీ, బస్తీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆయా కాలనీ, బస్తీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అక్కడికక్కడే అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరింప చేశారు.

## స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలకు హాజరు కావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



కుత్బుల్లాపూర్ , జనవరి 10, ( ప్రజా పాలన) : కుత్బుల్లాపూర్ సర్కిల్ రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్ లోని మహాత్మా గాంధీ కమ్యూనిటీ హాల్లో ఈ నెల 12న నిర్వహించే స్వామి వివేకానంద 161 వ జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షులు జల్దా లక్ష్మీనాథ్ బుధవారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ను మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ జీడిమెట్ల, (హైదరాబాద్) , మల్లారెడ్డి ఆసుపత్రి వారి సహకారంతో 18వ రక్తదాన శిబిరంతో పాటు ఉచిత కీళ్ళ నొప్పులు, కార్డియాక్ దంత , షుగర్ వ్యాధి శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## గ్రాడ్యుయేట్స్ అందరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవలెను: వార్డ్ కౌన్సిలర్ ఎర్రగుంట లక్ష్మీ రమేష్



మధిర జనవరి 10 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో వార్డు కౌన్సిలర్ యర్రగుంట లక్ష్మి రమేష్.మాజీ ఎంపీపీ 21 వార్డు కౌన్సిలర్ పార్టీ నాయకులు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ అందరూ ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు కొరకు ఆన్ లైన్ ద్వారా కావలసిన సర్టిఫికెట్స్ డిగ్రీ మేమో ఒరిజినల్ ఓటర్ ఐడి కార్డుపాస్ ఫోటోఆధార్ కార్డుఆన్ లైన్ ద్వారా మాత్రమే కావలసినవిఎమ్మెల్సీ ఓటుకు అర్హులైన వారు1-11-2023 నాటికి డిగ్రీ అయిపోయి ఉండాలిదీనికి ముందు ఓటు హక్కును కలిగి ఉన్న వారు కూడా ఆన్లైన్ ద్వారా ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవలెను ప్రజలకు విద్యార్థులకు వార్డు కౌన్సిలర్ తెలుపుతున్నారు

## ఈ నెల 12 నుండి గచ్చిబౌలిలో ప్రపంచ తైక్వాండో ఛాంపియన్ షిప్ లీగ్ పోటీలు...




హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి): ప్రపంచ దేశాల్లో ఎంతో గుర్తింపు పొందిన ఇంటర్నేషనల్ తైక్వాండో ఛాంపియన్ షిప్ లీగ్ (ఐటిసిఎల్ ) పోటీలను హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ప్రముఖ మెజిషియన్ సామల వేణు తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని 206 దేశాల్లో ఈ మార్షల్ ఆర్ట్స్ క్రీడకు ఎంతో ఆదరణ ఉందని.. అంతటి ఆదరణపొందుతున్న క్రీడను హైదరాబాద్ నగరంలో తొలిసారిగా పరిచయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 12,13,14 తేదీల్లో మూడురోజులపాటు ఈ పోటీలు జరగనున్నాయని, మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 వరకు జరుగుతాయన్నారు. క్రీడలపై మక్కువ ఉన్నవారు ఎవరైనా ఈ పోటీలను వీక్షించడానికి రావచ్చని దీనికి ఎటువంటి ఎంట్రీ ఫీజు లేదన్నారు. క్రీడల ప్రారంభ రోజున యు ఎ ఈ లో ప్రముఖ గాయకుడు అహ్మద్ అల్ హొసాని తో భారత జాతీయ గీతాలాపన ఉంటుందని,ముగింపు రోజు 14 వతేదీన అబ్దుల్లా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ డాక్టర్ బు. అబ్దుల్లా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేస్తారని చెప్పారు. విలేకరుల సమావేశంలో ఐటి హెడ్ మక్రంద్, డైరెక్టర్స్ గిరిబాబు, సీహెచ్ సుప్రియ పాల్గొన్నారు.

## ఆర్థికంగా అభివృద్ధి చెందేలా నిరుద్యోగ యువతను ప్రోత్సహించాలి: జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



ప్రజాపాలన, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 10, : ఆర్థికంగా అభివృద్ధి చెందేలా జిల్లాలోని నిరుద్యోగ యువతను ప్రోత్సహించడంతో పాటు జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి సహకరించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ నూతన శాఖను బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మహేష్ నాయుడు, వైస్ ప్రెసిడెంట్ నాగేశ్వర్రావు, శాఖ మేనేజర్ ఒమర్ ఫరూఖీ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయంగా హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ ఎన్నో విధములైన సేవలతో విద్యార్థులు, పారిశ్రామిక వేత్తలు, రైతులకు రుణ సదుపాయం కల్పిస్తూ ఆర్థిక చేయూత అందించడంతో పాటు బ్యాంకింగ్ రంగంలో విశిష్ట సేవలు అందిస్తుందని, నస్పూర్లో బ్యాంక్ శాఖను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. జిల్లాలో నిరుద్యోగ యువత, పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహిస్తూ జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ఈ శాఖతో కలిపి 6 శాఖలు ఉన్నాయని, మంచిర్యాల పరిధిలో 3 శాఖలతో సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయి



సంగారెడ్డి, ప్రజాపాలన ప్రతినిధి: శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని డిసిసి అధ్యక్షురాలు నిర్మల జయప్రకాశ్ రెడ్డి తెలిపారు. బుధవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని స్థానిక టీఎన్జీవో భవన్ లో సంగారెడ్డి పట్టణం, తాళ్ళపల్లి, ఇస్మాయిల్ ఖాన్ పేట్, గుడితండా గ్రామాల లబ్దిదారులకు కళ్యాణాలక్ష్మి షాదిముబారక్ చెక్కులను డిసిసి అధ్యక్షురాలు నిర్మల జయప్రకాశ్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో తాళ్ల పల్లి సర్పంచ్ ప్రవీణ్, నాయకులు సందీప్ రెడ్డి, రఘు గౌడ్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

## సంపాదకీయం

గురువారం 11, జనవరి 2024

# అచ్ఛే దిన్, వికసిత భారత్!

వాజ్‌పేయి ప్రధానిగా ఉండగా బిజెపి 2004 ఎన్నికల్లో ఇచ్చిన నినాదం 'వెలిగిపోతున్న భారత్'. తరువాత అదే బిజెపి 2014లో ముందుకు తెచ్చిన నినాదం 'అచ్ఛే దిన్', తాజాగా ప్రధాని నరేంద్ర మోడీ డిసెంబరు రెండవ వారంలో 'వికసిత భారత్' ప్రభుత్వ సంకల్పమని ప్రకటించారు. మూడు నినాదాలకు తేడా ఉంది. మొదటిది తమ విఫలమైన పాలనను కప్పిపుచ్చుకొనేందుకు భారత్ వెలిగిపోతోంది అన్నారు. కాంగ్రెస్ పాలన మీద ధ్వజమెత్తేందుకు తాము అధికారానికి వస్తే అచ్ఛే దిన్ (మంచి రోజులు) తెస్తామని ఆశ చూపారు. పదేళ్ల తరువాత వాటి జాడ కనిపించటం లేదు. దీంతో మరో పాతికేళ్లలో 2047 నాటికి అభివృద్ధి చెందిన వికసిత భారత్‌గా దేశాన్ని మారుస్తామని నమ్మబలుకుతున్నారు. సంకీర్ణ ప్రభుత్వాలతో మూడు దశాబ్దాల కాలం వృధా అయిందని, పాలన లేకపోవటాన్ని, సంతుష్టీకరణ రాజ కీయాలను జనం చూశారని ప్రధాని నరేంద్ర మోడీ ధ్వజమెత్తారు. ఈ కారణంగానే బిజెపిని సహజ ఎంపికగా జనం పరిగణిస్తున్నారని, 2024లో తాము ఎవరి మీదా ఆధారపడని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని 'ఇండియా టుడే' మాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. పదేళ్ల క్రితంతో పోల్చితే ఇప్పుడు అన్ని రంగాలు మెరుగైన పని తీరు కనపరుస్తున్నాయని ఉద్ఘాటించారు. ఇలాంటి ముఖాముఖిలో మోడీ చెప్పింది రాసుకోవటం తప్ప విమర్శనాత్మక ప్రశ్నలు అడిగే అవకాశం ఉండదన్నది తెలిసిందే. 'మోడీ–హిజ్ మాస్టర్స్ వాయిస్' మీడియా ఆడుతున్న మైండ్ గేమ్‌లో ఇలాంటివి కొత్త కాదు. ఎప్పుడైనా విలేకర్ల సమావేశం పెట్టి ఎదురయ్యే ప్రశ్నలకు జవాబు చెబితే జనానికి నాణానికి మరోవైపు ఏముందో తెలుస్తుంది. 2014 ఎన్నికల సమయంలో సెలవిచ్చిన అచ్ఛే దిన్, నల్లధనం వెలికితీత, గుజరాత్ తరహా అభివృద్ధి వంటి అంశాలను ఏ మేరకు సాధించారో ఎక్కడా చెప్పటం లేదు. జనాలను మార్కెటింగ్ మాయాజాలంలో ముంచి తమ ఉత్పత్తులను అమ్ముకొనేందుకు వ్యాపార సంస్థలు విడుదల చేసే వాణిజ్య ప్రకటనల గురించి తెలిసిందే. దేశంలో పలు పార్టీలు ఇప్పుడు ఇస్తున్న నినాదాలు, చేసే ప్రసంగాలు, ప్రదర్శించే హావభావాల వెనుక అలాంటి మార్కెటింగ్ నిపుణులు ఉన్నారన్నది బహిరంగ రహస్యం. గతంలో ప్రజా ఉద్యమాల నుంచి నినాదాలు పుట్టేవి. ఇప్పుడు అనేక పార్టీలకు వాటితో పనిలేదు. వాజ్‌పేయి ప్రధానిగా ఉండగా బిజెపి 2004 ఎన్నికల్లో ఇచ్చిన నినాదం "వెలిగిపోతున్న భారత్". తరువాత అదే బిజెపి 2014లో ముందుకు తెచ్చిన నినాదం "అచ్ఛే దిన్", తాజాగా ప్రధాని నరేంద్ర మోడీ డిసెంబరు రెండవ వారంలో "వికసిత భారత్" ప్రభుత్వ సంకల్పమని ప్రకటించారు. 2024లో ఎన్నికల్లోపు ఎలాంటి అనూహ్య ఉదంతాలు జరగక లేదా జరపకపోతే దాన్నే బిజెపి స్వీకరించి ఎన్నికల గోదాలోకి దిగనుంది. మూడు నినాదాలకు తేడా ఉంది. మొదటిది తమ విఫలమైన పాలనను కప్పిపుచ్చుకొనేందుకు భారత్ వెలిగిపోతోంది అన్నారు. కాంగ్రెస్ పాలన మీద ధ్వజమెత్తేందుకు తాము అధికారానికి వస్తే అచ్ఛే దిన్ (మంచి రోజులు) తెస్తామని ఆశ చూపారు. పదేళ్ల తరువాత వాటి జాడ కనిపించటం లేదు. దీంతో మరో పాతికేళ్లలో 2047 నాటికి అభివృద్ధి చెందిన వికసిత భారత్‌గా దేశాన్ని మారుస్తామని నమ్మబలుకుతున్నారు. వికసిత భారత్ 2047 రోడ్ మాప్ ప్రకారం ఆ సంవత్సరానికి మన దేశం అభివృద్ధి చెందిన జాబితాలో చేరుతుందని చెబుతున్న దాన్ని జనం నమ్మేదెలా? అభివృద్ధి లక్షణాలలో అధిక తలసరి రాబడి ఒకటి. దాన్లో ఇప్పుడు మనం ఎక్కడున్నాం? ప్రపంచబ్యాంకు రూపొందించిన అట్లాస్ పద్ధతి ప్రకారం 2022 సంవత్సర వివరాల మేరకు 190 దేశాల జాబితాలో జిఎన్ఐ తలసరి ఆదాయంలో ముందున్న తొలి 59 దేశాల్లో రెండవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న చైనాకే చోటు లేదు. ఎగువ మధ్య తరగతి ఆదాయ జాబితాలో రెండవదిగా, మొత్తం దేశాలలో 61వ స్థానంలో ఉంది. మన దేశం దిగువ మధ్య తరగతి జాబితాలో 26వ స్థానంలో మొత్తం దేశాల్లో 140వదిగా ఉంది. సంకీర్ణ ప్రభుత్వాలతో దేశం వెనుకబడిందని మోడీ అన్నారు. జనానికి సమాచారం అందుబాటులో ఉన్నా చూసే ఓపిక, ఆసక్తి కూడా లేని బలహీనతను పాలకులు సొమ్ము చేసుకుంటున్నారు. సంకీర్ణ ప్రభుత్వం ఉన్న 2004లో భారత జిఎన్ఐ 600 డాలర్లు 2013 నాటికి 1,500కు చేరింది. వార్షిక సగటు రేటు 11.48 శాతం. కాగా స్థిరమైన, స్పష్టమైన విధానాలు అమలు జరిపినట్లు చెప్పుకున్న నరేంద్ర మోడీ పాలనలో 2022 నాటికి అది 2,380 డాలర్లకు, వార్షిక వృద్ధి రేటు 5.44 శాతమే పెరిగింది. సంతోష సూచికలో 146 దేశాలకు గాను మనదేశం 137వ స్థానంలో ఉంది. కొంత మంది అంగీకరించినా లేకున్నా మన కంటే ఎగువన చైనా 82, నేపాల్ 85, బంగ్లాదేశ్ 99, పాకిస్తాన్ 103, శ్రీలంక 126వ స్థానాల్లో ఉన్నాయి. అయినప్పటికీ భారత్‌ను వికసింప చేస్తామని చెప్పటం నరేంద్ర మోడీకే చెల్లింది. భారత్ అప్పుల పాలు కానుందని సరిగ్గా వికసిత భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించిన సమయంలోనే అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) రూపొందించిన నివేదిక హెచ్చరించింది. ప్రపంచంలో మన దేశ స్థానం గురించి వివిధ సంస్థలు వెల్లడిస్తున్న సూచికలను అధికార బిజెపి, అది నడుపుతున్న కేంద్ర ప్రభుత్వం కూడా అంగీకరించదు. తప్పుల తడకలని, వారికి లెక్కలు వేయటం రాదని బుకాయించటం తెలిసిందే. పోనీ వారు నమ్మే వేదగణితం ప్రకారం మనం నిజంగా ఎక్కడున్నామో, ఎలా ఉన్నామో ఎప్పుడైనా చెప్పారా? ఇప్పుడు ఐఎంఎఫ్ చెప్పిందాన్ని కూడా తాము అంగీకరించటం లేదని, అవన్నీ ఊహాగానాలు తప్ప వాస్తవం కాదని కేంద్ర ప్రభుత్వం గింజుకుంది. నెరవేరని ఐదు లక్షల కోట్ల డాలర్ల జిడిపి కబుర్లు కూడా ఊహాగానమే. వర్తమాన వికసిత భారత్ కూడా అదే, వాస్తవం కాదు. వికసిత భారత్, తమ విజయం నల్లేరు మీద బండిలా సాగుతుందని చెప్పుకుంటున్న పూర్వరంగంలో ఐఎంఎఫ్ విశ్లేషణ గొంతులో పచ్చి వెలక్కాయ వంటిదే. ఇంతకీ అదేమి చెప్పింది? ప్రతికూల దెబ్బలు తగిలితే 2028 నాటికి జిడిపి ఎంత ఉంటుందో ప్రభుత్వ అప్పు అంతకు (వంద శాతం) చేరుతుందని హెచ్చరించింది. ఒక శతాబ్దిలో ఒకసారి వచ్చే కరోనా–19 మాదిరి విపరీత పరిణామాలు సంభవిస్తే అని ఐఎంఎఫ్ చెప్పిందని, అలాంటివేమీ జరిగే అవకాశం లేదని కేంద్ర ప్రభుత్వం అన్నది. తమ నేత అధికారానికి వచ్చిన తరువాత విదేశీ అప్పులేమీ చేయటం లేదని ప్రచారం చేస్తున్న భక్తులను సంతుష్టీకరించలేము. మాక్రో ట్రెండ్స్ నెట్ సమాచారం ప్రకారం 1970లో ఎనిమిది బిలియన్ డాలర్లుగా ఉన్న విదేశీ అప్పు నూతన ఆర్థిక విధానాలను అమల్లోకి తెచ్చిన 1990నాటికి 83కి చేరింది.

సామాజిక దృక్పథంతో మీరు రాసే రచనలు
editor.prajapalana@gmail.com
మెయిల్ కు పంపించినచో ప్రజా పాలన
దినపత్రికలో ప్రచురించబడును

# నాణ్యత లోపించిన పరిశోధన పత్రాలు

దేశంలో తొంభై శాతం పైగా అకడమిక్ ప్రచురణలు తస్కరించబడినవి, నాసిరకంగా ఉండడం, వీటిపైన యూజీసీ, ఏఐసిటిఇ, ఎన్ఎంసి సంస్థల నియంత్రణ లేకపోవడం వల్ల బ్రోకర్లకు, తార్పుడుగాళ్లకు, నకిలీ ప్రచురణ సంస్థలు దొంగ ప్రచురణలు అంతులేకుండా పోయింది. స్కోపస్ ఇండెక్స్ చేసిన జర్నల్స్‌లో నాసిరకం కల్పిత పరిశోధనా పత్రాలను అనైతికంగా ప్రచురించడం తీవ్రమైన ఆందోళన కలిగిస్తుంది. ఇటువంటి పద్ధతులు అకడమిక్ పబ్లిషింగ్ సిస్టమ్ యొక్క సమగ్రతను దెబ్బతీస్తాయి, శాస్త్రీయ పరిశోధన ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి, పరిశోధకులు సంస్థల విశ్వసనీయతకు దీర్ఘకాలిక పరిణామాలను కలిగిస్తాయి. ఈ సమస్య భారతదేశంలో మాత్రమే కాదు ప్రపంచవ్యాప్తంగా గమనించబడింది, ఎందుకంటే దోపిడీ ప్రచురణ పద్ధతులు సమాజంలో సవాల్‌గా మారాయి. నకిలీ వెబ్‌సైట్‌ల సృష్టి, రచయితల విక్రయం మధ్యవర్తుల ప్రమేయం దోపిడీ ప్రచురణ పద్ధతులకు సంబంధించిన పెద్ద తలనొప్పిగా మారింది. ఇటువంటి పద్ధతులు అకడమిక్ పబ్లిషింగ్ యొక్క నాణ్యత మరియు విశ్వసనీయతను రాజీ చేయడమే కాకుండా డబ్బు కోసం కోసం పరిశోధకులను దోపిడీ చేస్తాయి. చట్టబద్ధమైన జర్నల్స్ అనుకరించే నకిలీ వెబ్‌సైట్‌లను సృష్టించడం మోసపూరిత పద్ధతి. పరిశోధకులు తమ పనిని తెలియకుండానే ఈ మోసపూరిత ప్లాట్‌ఫారమ్‌లకు సమర్పించవచ్చు, కంటెంట్ సరైన ఆపాదింపు లేకుండా ఉపయోగించబడవచ్చు. ఇది పరిశోధనను బలహీన పరచడమే కాకుండా నైతిక చట్టపరమైన సమస్యలకు కూడా దారి తీస్తుంది. నిజమైన పరిశోధన విలువ తగ్గించబడవచ్చు అకడమిక్ జర్నల్స్ యొక్క విశ్వసనీయత తీవ్రంగా ప్రభావితమవుతుంది. క్లయింట్‌ల తరపున మొత్తం పరిశోధనా పత్రాలను రూపొందించడానికి ఘోస్ట్‌రైటర్‌లను ఉపయోగించడం ఒక రకమైన విద్యాపరమైన దుష్ప్రవర్తన. ఇది పరిశోధనలో రచయిత, పారదర్శకత జవాబుదారీ సూత్రాలను బలహీన పరుస్తుంది. వ్యక్తులు, రచయితలు జర్నల్స్ మధ్య మధ్యవర్తులుగా వ్యవహరిస్తారు, డబ్బు కోసం పేపర్ ప్రచురణను సులభతరం చేస్తారు, దోపిడీ ప్రచురణ పర్యావరణ వ్యవస్థ కు దోహదం చేస్తారు. ఈ మధ్యవర్తిత్వం తరచుగా పరిశోధకులను దోపిడీ చేసే ప్రచురించిన కంటెంట్ నాణ్యతను దెబ్బతీసే ఆర్థిక లావాదేవీలను కలిగి ఉంటుంది. పిల్లలు కలగని వారికి అద్దె గర్భాలు ఉన్నట్లు, అకడమిక్ స్కోర్ పెంచుకోవడానికి సరోగసి రీసర్చ్ ఉంది. ప్రొఫెసర్లు, ప్రిన్సిపాల్, డైరెక్టర్ల గా నియామకానికి కొంత అకడమిక్ పర్ఫామెన్స్ ఇండికేటర్లు ఉంటాయి. ఈ మార్కులు రావడానికి అధ్యాపక బృందం బ్రోకర్లను నమ్ముకొని నకిలీ పత్రాలకు వేలకు వేలు సమర్పించుకొని విశ్వవిద్యాలయాలలో రాటిఫికేషన్ పేరుతో సఫలీకృతులవుతారు. యూనివర్సిటీ యంత్రాంగం గుడ్డి గుర్రానికి పళ్ళు తోముతున్న ట్లు వ్యవహరిస్తున్నారు. దోపిడీ పత్రికల లక్షణాలు మరియు అనైతిక ప్రచురణ పద్ధతులతో కలిగే నష్టాల గురించి పరిశోధకులకు అవగాహన కల్పించాలి. తెలియని జర్నల్‌లకు పనిని సమర్పించడం గురించి జాగ్రత్తగా ఉండటం మరియు త్వరిత మరియు హామీతో కూడిన ప్రచురణకు హామీ ఇచ్చే మధ్యవర్తులను నివారించడం వంటివి ఇందులో ఉన్నాయి. రచయితలు తమ పనిని పారదర్శకమైన మరియు కఠినమైన పీర్–రివ్యూ ప్రక్రియతో ప్రసిద్ధ పత్రికలకు సమర్పించడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. అక్రిడిటేషన్ సంస్థలు మరియు ఇండెక్సింగ్ సేవలు పత్రికల విశ్వసనీయతను స్థాపించడంలో మరియు నిర్వహించడంలో పాత్ర పోషిస్తాయి. పత్రికలు కఠినమైన నైతిక మార్గదర్శకాలు మరియు పారదర్శక సంపాదకీయ ప్రక్రియలకు కట్టుబడి ఉండాలి. పీర్–రివ్యూ విధానాలు మరియు సంపాదకీయ ప్రమాణాల గురించి స్పష్టమైన కమ్యూనికేషన్ రచయితలు మరియు పాఠకుల మధ్య నమ్మకాన్ని పెంపొందించడంలో సహాయపడుతుంది. నకిలీ వెబ్‌సైట్‌లను సృష్టించడం, రచయితలను విక్రయించడం లేదా ఘోస్ట్‌రైటింగ్‌ను సులభతరం చేయడం వంటి మోసపూరిత పద్ధతుల్లో నిమగ్నమై ఉన్న సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు. చట్టవిరుద్ధమైన కార్యకలాపాలను మూసివేయడానికి మరియు వ్యక్తులను జవాబుదారీగా ఉంచడానికి అధికారులు చర్య తీసుకోవచ్చు. విద్యా సంస్థలు, పరిశోధకులు మరియు చట్టబద్ధమైన జర్నల్‌లు దోపిడీ పబ్లిషింగ్ సందర్భాలను నివేదించడానికి మరియు పరిష్కరించడానికి స్కోపస్ వంటి ఇండెక్సింగ్ సేవలతో సహకరించాలి. ఇటువంటి పద్ధతులు ఫ్లాగ్ చేయబడి, తగిన విధంగా వ్యవహరించేలా ఇది సహాయపడుతుంది. అనైతిక ప్రచురణ పద్ధతులు విద్యా వ్యవస్థలో విశ్వసనీయత సంక్షోభానికి దోహదం చేస్తాయి. నాణ్యత లేని లేదా కల్పిత పరిశోధనల వ్యాప్తి శాస్త్రీయ సమాజాన్ని ప్రజలను తప్పుదారి పట్టించగలదు. రాజీపడిన పీర్–రివ్యూ బోర్డుల ప్రమేయం, నాసిరకం పేపర్ల ప్రచురణ ఈ జర్నల్‌లతో అనుబంధించబడిన చట్టబద్ధమైన పత్రికలు, పరిశోధకుల ప్రతిష్టను దెబ్బతీస్తుంది. ఇటువంటి పద్ధతులు భారతీయ పరిశోధకులు సంస్థల ప్రపంచ అవగాహనను ప్రభావితం చేస్తాయి. మోసపూరితమైన పరిశోధనలు ప్రచారం చేయబడినప్పుడు సైన్స్ సంస్థలపై ప్రజల విశ్వాసం క్షీణిస్తుంది, ఇది శాస్త్రీయ ప్రక్రియ పై విశ్వాసం కోల్పోయేలా చేస్తుంది. జర్నల్స్, స్కోపస్ వంటి ఇండెక్సింగ్ సేవలు, విద్యాసంస్థలు అనైతిక ప్రచురణ పద్ధతులను గుర్తించడంలో మరియు అరికట్టడంలో అప్రమత్తంగా ఉండాలి. జర్నల్స్ పత్రికలు తమ పీర్–రివ్యూ ప్రక్రియలలో పారదర్శకతను కొనసాగించాలి. ఆంగ్లంలో అవసరమైన ప్రావీణ్యం లేని వ్యక్తులు పరిశోధనా పత్రాల ప్రచురణ కోసం డబ్బు చెల్లించి విద్యా రంగంలో ఉన్నత స్థానాలు పొందుతుండటం, అనైతిక పద్ధతులను ఆశ్రయించడం నిజంగా ఆందోళనకరం. ఈ పరిస్థితి అకడమిక్ ప్రచురణల నాణ్యతను దెబ్బతీయడమే కాకుండా విద్యావ్యవస్థ సమగ్రతను దెబ్బతీస్తుంది. విద్యా వ్యవస్థలో విద్యా సమగ్రత మరియు నైతిక ప్రవర్తన యొక్క సంస్కృతిని పెంపొందించడం యొక్క ప్రాముఖ్యతను విశ్వవిద్యాలయాలు, కీలక సంస్థలు దెబ్బతీస్తున్నాయి. విద్యా సంస్థలు, అక్రిడిటేషన్ సంస్థలు ఇండెక్సింగ్ సేవల మధ్య సహకారం అకడమిక్ పబ్లిషింగ్ కోసం గ్లోబల్ స్టాండర్డ్‌లను స్థాపించడంలో సహాయపడుతుంది. పరిశోధకులు, అధ్యాపకులు విద్యా నిర్వాహకులకు నిరంతర వృత్తిపరమైన అభివృద్ధి అవసరం. ఇందులో వర్క్‌షాప్‌లు, శిక్షణా సెషన్‌లు పరిశోధనా నీతి మరియు బాధ్యతాయుతమైన ప్రవర్తనపై దృష్టి కేంద్రీకరించబడిన వనరులు ఉండాలి. బాధ్యతాయుతమైన పరిశోధన ప్రవర్తనపై విద్యా కార్యక్రమాలు ప్రయోజనకరంగా ఉంటాయి. విద్యా సంస్థలు విద్యా సమగ్రతపై తమ విధానాలు బలోపేతం చేయాలి. సమగ్రత యొక్క సంస్కృతిని పెంపొందించడం ద్వారా, అవసరమైన మద్దతును అందించడం, ఉన్నత ప్రమాణాలు నిలబెట్టడం ద్వారా, విద్యా సంఘం పరిశోధన ప్రచురణల విశ్వసనీయతను కొనసాగించడానికి పని చేయవచ్చు.

**డా. యం, సురేష్ బాబు,**
**అధ్యక్షులు , ప్రజాసైన్స్ వేదిక**

# హోదాపై జాతీయ పార్టీల జలకాలాట

2024, జనవరి 4న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర జల్‌శక్తి శాఖమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిశారు. వాళ్లు సదరు మంత్రిని పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇవ్వాలని కోరినట్టు పలు పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వార్తలు వెలువడ్డాయి. అయితే కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో భేటీ అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 'దేశంలోని ఏ ప్రాజెక్టుకు ఇప్పుడు జాతీయ హోదా ఇవ్వడం లేదు. కానీ, ఏదేని పథకం కింద పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి దాని అంచనాలో 60 శాతం నిధులు ఇస్తామని షెకావత్ హామీ ఇచ్చారు' అని ప్రకటించడం విడ్డూరం. మన్మోహన్ నేతృత్వంలోని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏపీ విభజన చట్టంలో భాగంగా తెలంగాణలో కూడా కృష్ణా నదిపైన నిర్మించేటువంటి పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా అంశానికి చట్టబద్ధత కల్పిస్తే బాగుండేది. కానీ యూపీఏ ప్రభుత్వం అలా చేయలేదు. ఆ నిర్ణయం తెలంగాణ ప్రజలకు శాపంగా మారింది. నాడు తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం వంచిస్తే, రాష్ట్రంలో గెలిచిన నలుగురు బీజేపీ ఎంపీలు నేటికీ రాష్ట్ర ప్రజలను నిర్లక్ష్యం చేస్తూనే ఉన్నారు. వాళ్లు ఎంపీలుగా గెలిచి ఐదేండ్లు పూర్తికావస్తున్నా రాష్ట్రానికి నిధులు తీసుకురావడం పక్కనపెడితే కనీసం ఒక్క ప్రాజెక్టుకైనా జాతీయహోదా తీసుకురాలేకపోయారు. 2014లో మోదీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అప్పటివరకు ఉన్నటువంటి ఏఐబీపీ, ఆర్ఆర్ఆర్ వంటి పథకాలను ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై)గా మార్చింది. పీఎంకే ఎస్‌వై పథకం కింద చిన్న చిన్న నీటి పారుదల ప్రాజెక్టులు, డైవర్షన్ కెనాల్స్, ఫీల్డ్ చానెళ్లు, వాటర్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్, చిన్న చిన్న ఎత్తిపోతల పథకాలను నిర్మించేందుకు రాష్ట్రాలకు కేంద్రం నిధులు అందిస్తున్నది. అదేవిధంగా రైతులకు డ్రిప్పులు, స్ప్రింక్లర్లు, రెయిన్‌గన్నులు ఏర్పాటు చేసుకోవడానికి ఈ పథకం ద్వారా సాయం చేస్తున్నది. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేంద్రం 60 శాతం నిధులు ఇస్తామని చెప్పడం నమ్మశక్యంగా లేదు. ఎందుకంటే పీఎంకేఎస్‌వై పరిధిలో అంత పెద్ద మొత్తంలో నిధులు ఉండవనేది



జగమెరిగిన సత్యం. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటన చూసిన తర్వాత నేను ఒక్కసారిగా పదేండ్లు వెనక్కి వెళ్లాను. పద్నాలుగేండ్ల సుదీర్ఘ పోరాటాల అనంతరం 2014లో తెలంగాణ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష నేరవేరింది. అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో నాతో పాటు ఎంతోమంది ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా పరిగెత్తించేందుకు తమ వంతు కృషిచేశారు. తత్ఫలితంగానే రాష్ట్రాన్ని పాలించమని తెలంగాణ ప్రజలు రెండోసారి కేసీఆర్ నాయకత్వానికి పట్టం కట్టారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణను అన్నిరంగాల్లో అగ్రపథంలో నిలబెట్టారు. జీఎస్డీపీ, తలసరి ఆదాయంలో తెలంగాణ నెంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకోవడమే కేసీఆర్ నేతృత్వంలో జరిగిన రాష్ట్రాభివృద్ధికి నిదర్శనం. అయితే ఇప్పుడు ప్రాజెక్టులు–వాటి జాతీయ హోదా విషయమై చర్చిద్దాం. స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏండ్లలో దేశంలో ఇప్పటివరకు మంజూరైన జాతీయ ప్రాజెక్టులు 17. అందులో పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో రెండేసి జాతీయ ప్రాజెక్టులు, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, యూపీ, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, ఏపీ, అసోం, కర్ణాటక రాష్ట్రాల్లో ఒక్కో జాతీయ ప్రాజెక్ట మంజూరైంది. హిమాచల్/ ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు ఒక ఉమ్మడి జాతీయ ప్రాజెక్టు మంజూరైంది. దేశంలో 28 రాష్ట్రాలుంటే 11 రాష్ట్రాల్లో మాత్రమే జాతీయ ప్రాజెక్టులున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ మొదలు అప్పటి కేంద్ర జలవనరుల శాఖమంత్రులు ఉమాభారతి, నితిన్ గడ్కరీ, గజేంద్ర షెకావత్ దాకా రాష్ట్రంలోని ఏదేని ఒక ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని చాలాసార్లు విన్నవించుకున్నాం. సాగునీటి పారుదల శాఖ అధికారులతో కలసి అనేకసార్లు లేఖలు రాశాం. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా మోదీకి ఎన్నోసార్లు విన్నవించుకున్నారు. అయినా మా విన్నపాలను కేంద్ర ప్రభుత్వం చెవికెక్కించుకోలేదు. ఒక్క తెలంగాణకే కాదు దేశంలోని అన్ని రాష్ట్రాల్లోని ఏదేని ఒక ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని పోరాటం చేసిన ఘనత ఉద్యమ నాయకుడైన కేసీఆర్‌ది. 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం సాగునీటి రంగంలో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి పలు పథకాలను రూపొందించింది. పరాయి పాలనలో జరిగిన అన్యాయాన్ని సవరించడానికి అప్పటి ప్రభుత్వం తీవ్రంగా శ్రమించింది. కేసీఆర్ నేతృత్వంలో నాతో పాటు అప్పటి ఎంపీలందరం కలిసి కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు న్యాయంగా దక్కవలసిన వాటా కోసం పార్లమెంటులో పెద్ద ఎత్తున పోరాటం చేశాం. చాలాసార్లు పార్లమెంటును సాగకుండా చేసిన సందర్భాలున్నాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం 2014 తర్వాత ఏ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదని చెప్పుకొంటూనే ఎన్నికలు వచ్చిన రాష్ట్రంలోని ఒక ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తూ లబ్ధి పొందే ప్రయత్నం చేసింది. 2021లో ఉత్తరప్రదేశ్‌లోని సరయూనహర్ ప్రాజెక్టుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జాతీయ హోదా కల్పించింది. అనంతరం 2022లో యూపీలో అసెంబ్లీ ఎన్నికలు జరుగగా యోగి సర్కార్ రెండోసారి అధికారంలోకి వచ్చింది. యూపీలో ఒక ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి అధికారంలోకి వచ్చిన బీజేపీ కర్ణాటకలోనూ అదే ఫార్ములాను పాటించింది. అందులో భాగంగానే కర్ణాటకలోని అప్పర్‌భద్రా ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తున్నట్టు ప్రకటించి ఎన్నికలకు పోయింది. అయితే ఇక్కడ బీజేపీ బొక్కబోర్లా పడ్డది. అయినప్పటికీ తాజాగా జరిగిన మధ్యప్రదేశ్, రాజస్థాన్ ఎన్నికల్లో ఇదే ఫార్ములాను బీజేపీ మరోసారి నమ్ముకున్నది. మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు లబ్ధి చేకూరేవిధంగా 'ఈస్టర్న్ రాజస్థాన్ కెనాల్' ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి ఎన్నికల బరిలో దిగింది. తత్ఫలితంగా బీజేపీ ఆయా రాష్ట్రాల్లో అధికారాన్ని చేజిక్కించుకున్నది. ఇదిలా ఉంటే.. 2024 జనవరి 4న విలేకరుల సమావేశంలో అసలు విషయం బయటపడింది. కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ 'దేశంలోని ఏ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వడం' లేదని చెప్పినప్పుడు ఒక విలేకరి కర్ణాటక ప్రాజెక్టుకు జాతీయహోదా కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. కర్ణాటక ప్రాజెక్టుకు ప్రకటించిన జాతీయ హోదాను వెనక్కితీసుకున్నామని ఆ సమావేశంలో కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల సమక్షంలో ప్రకటించడం విడ్డూరం.



# 'స్థానిక' నేతలపై నజర్

## ఎన్నికల్లో కీలకం కానున్న స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు

ప్రజాపాలన ప్రతినిధి:లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నాయి. మరోవైపు ఫిబ్రవరి నెలలో సర్పంచ్‌ల పదవీకాలం పూర్తవుతోంది. పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అదేవిధంగా మండల, జిల్లా పరిషత్‌లు, మునిసిపాలిటీలు, పీఏసీఎసల ఎన్నికలు కూడా రానున్నాయి. లోక్‌సభతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. ఎన్నికల సంవత్సరంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కీలకం కానున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలంతా గతంలో పార్టీని వీడిన ప్రజాప్రతినిధులను, మాజీ ప్రజాప్రతినిధులతో సంప్రదింపులు చేస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాల్లోని స్థానిక సంస్థల్లో 90శాతం మేర బీఆర్ఎస్ కు చెందిన ప్రజాప్రతినిధులే ఉన్నారు. మెజార్టీ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లు, మునిసిపాలిటీల్లో బీఆర్ఎస్ హవా ఉంది. స్థానిక సంస్థ ల్లో బలపడితేనే వచ్చే ఎన్నికల్లో విజయం సులువు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల్లో కాంగ్రెసను పటిష్టం చేసేందుకు అధికార పార్టీ ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తోంది. ఈ మేరకు సీనియర్ నేతలతో ఎమ్మెల్యేలు ప్ర త్యేకంగా సమావేశమవుతున్నారు. గ్రామ, మండల, జిల్లా కమిటీల్లో చురుకైన ప్రాత పోషించే వారికి ప్రాధా న్యం ఇస్తున్నారు. కాంగ్రెస్ జిల్లా కమిటీ(డీసీసీ) కార్యవర్గాలను కూడా త్వరలో ప్రకటించేందు కు సిద్ధమవుతున్నారు. బీఆర్ఎసలోని అస ంతృప్త నేతలను తమవైపునకు తిప్పుకునేందుకు ఎమ్మెల్యేలు సన్నద్ధమవుతున్నారు. మరోవైపు బీఆర్ఎస్ సైతం రానున్న అన్ని ఎన్నికల్లో సత్తా చాటాలని, పార్టీ కేడర్‌ను కాపాడుకునే పనిలో నిమగ్నమైంది. ఈ మేరకు నియోజకవర్గాల వారీగా ముఖ్యనేతలతో సమావేశాలు నిర్వహిస్తోంది. అయితే లోక్‌సభతో పాటు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టు సాధించాలంటే పార్టీని మరింత బలోపేతం చేయాలని బీఆర్ఎస్ నేతలు పిలుపునిస్తున్నారు. ఇక రాష్ట్రంలో 10సీట్లు కైవసం చేసుకోవాలని బీజేపీ అధిష్ఠానం నేతలకు దిశా నిర్దేశం చేసింది. ఈ నేపథ్యంలో పార్టీని స్థానికంగా మరింత బలోపేతం చేసేందు కు త్వరలో పదాధికారులను మార్చే అవకాశం ఉంది. ప్రస్తుతం కొనసాగుతున్న జిల్లా కమిటీల పదవీకాలం కూడా ముగియడంతో, నూతన సారధి ని నియమించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. స్థానికంగా పార్టీని పటిష్టం చేసేందుకు అనుబంధ సంఘాలతో బీజేపీ సమావేశాలు నిర్వహిస్తోంది.

**తెరపైకి 'పుర' అవిశ్వాసాలు:** ప్రభుత్వం మారడంతో మరోసారి మునిసిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానా లు తెరపైకి వచ్చాయి. ఇప్పటికే నల్లగొండ మునిసిపాలిటీ చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గడంతో పదవి కోల్పోవాల్సి వచ్చింది. త్వరలో నూతన పాలకమండలి ఏర్పాటు కానుంది. యాదాద్రి జిల్లాలోని పలు మునిసిపాలిటీల చైర్మన్‌లు, వైస్‌చైర్మన్‌లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతూ కలెక్ట ర్ వినతిపత్రాలు ఇచ్చారు. ప్రభుత్వం మారడటంతో అవిశ్వాస తీర్మానంపై స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పట్టుపడుతున్నారు. భువనగిరి, ఆలే రు, యాదగిరిగుట్ట మునిసిపాలిటీల్లో అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టాలని కలెక్టర్‌కు కౌన్సిలర్లు విన్నవించారు. దీంతో భువనగిరిలో ఈ నెల 23న ప్రత్యేక సమావేశానికి నోటీసులు జారీ అయ్యాయి. ఆలేరు, చౌటుప్పల్, యాదగిరిగుట్ట మునిసిపాలిటీలపై కూడా జిల్లాయంత్రాంగం నిర్ణయం తీసుకోనుంది.

**సర్పంచ్ ఎన్నికలు ఇప్పట్లో లేనట్టే?:** గ్రామపంచాయతీ పాలకవర్గాలు 2019లో ఏర్పడ్డాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 1వ తేదీతో పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం తీరనుంది. పదవీకాలం ముగిసే మూడు నెలల ముందుగానే పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలి. ఎన్నికల నిర్వహణకు రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది నియమాకం వంటి ప్రధాన పనులు చేపట్టాలి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి జిల్లా యంత్రాంగానికి లేఖలు అందాయి. అయితే ఓటర్ల జాబితాకు అధికారుల నియమాకంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ నేపథ్యంలో సర్పంచ్ ఎన్నికలు లేనట్టేనని ప్రజాప్రతినిధుల్లో అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# నిరుపేద కుటుంబాన్ని ఆదుకున్న బొల్లెద్దు సంధ్య



మధిర జనవరి 10 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో చేతులెత్తివేడుకుంటున్న ఎలాగైనా నాభర్తను కాపాడండి అనిబోరున విలపిస్తున్న కొండ ఆంజనేయులు ఆరోగ్య పరిస్థితి సరిగా లేక ఇంట్లో గడవని పరిస్థితులలో మానవతా దృక్పథంతో బియ్యం నిత్యవసర సరుకులు కూరగాయలు అందించారు టీచర్ సంధ్య మరియు హనీ టిఫిన్ సెంటర్ శాంతి థియేటర్ ఎదురుగా కమలా ఇద్దరు చంటి బిడ్డలతో కుటుంబ పరిస్థితి గడవక భార్య ప్రమీల ఎంతో ఇబ్బంది పడుతుండగా బియ్యం నిత్యవసర సరుకులు కూరగాయలు అందించి మానవత్వం చాటుకున్నారు.కన్న తల్లులను కూడా పట్టించుకోకుండా వదిలేస్తున్న ఈ రోజుల్లో తనకు ఉన్న దానిలోనే కొంత నిరుపేదలకు అందించటం అనాథ ఆశ్రమాలలో అన్నదానాలను నిర్వహించటం తో పాటు చదువుకునే పేద విద్యార్థులకు ఆర్థికంగా ఎంతో సహాయం చేస్తున్న మధిర వాస్తవ్యులు కీర్తిశేషులు బొల్లెద్దు బిక్షం స్టేషన్ మాస్టర్ కుమార్తె రత్నం కంటి ఆసుపత్రి డాక్టర్ రమేష్ బాబు గంగాభవాని మేనకోడలు బొల్లెద్దు సంధ్యా ని మరియు హనీ టిఫిన్ సెంటర్ కమల ని పట్టణానికి చెందిన పలువురు అభినందించారు ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

# అంధుల జీవితంలో వెలుగు నింపిన "లూయిస్ బ్రెయిలీ": జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



ప్రజాపాలన, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో ఆఫ్ జనవరి 10 :అంధుల కోసం లిపిని సృష్టించి అంధుల జీవితంలో వెలుగు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని జిల్లా కలెక్టర్‌బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలోజిల్లా స్త్రీ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన లూయిస్ బ్రెయిలీ 215వ జయంతి వేడుకలలో జిల్లా సంక్షేమశాఖ అధికారి కె. చిన్నయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి. శేషాద్రితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంధులు సామాన్యులతో సమానంగా అన్ని రంగాలలో ముందుండేలా ఆలోచించి లూయిస్ బ్రెయిలీ ఆరు చుక్కలతో కూడిన లిపిని తయారు చేయడం జరిగిందని, ఈ కారణంగా నేటి ప్రపంచంలో 4వ తరగతి ఉద్యోగ స్థాయి నుండి అత్యున్నత స్థాయి వరకు అన్ని రంగాలలో అంధులు ఈ నేపథ్యంలో తన బ్యాచ్లో అజయ్ అరోరా ఐ.ఎ.ఎస్. ఉన్నారని గుర్తు చేసుకున్నారు. తాను పడిన ఇబ్బంది వేరెవరూ పడకూడదనే ఉద్దేశ్యంతో భవిష్యత్తు పరిణామాలను ఆలోచించి బ్రెయిలీ లిపిని సృష్టించి అంధుల జీవితాలలోవెలుగులు నింపారని తెలిపారు. నిరుద్యోగ అంధుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని,బ్యాంకర్ల సమన్వయంతో రుణ సదుపాయం కల్పించి ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ప్రోత్సహించడం జరుగుతుందనితెలిపారు. అంధ దివ్యాంగులకు బ్రెయిలీ పుస్తకాలు, ఉపకరణాలు అందించేందుకు దిశగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామనితెలిపారు. అనంతరం బ్రెయిలి క్యాలెండర్ ఆవిష్కరించి, కేక్ కట్ చేసి అంధులకు శాలువాలతో సత్కరించి, ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు స్వయం ఉపాధి వైపు అడుగులు వేయడం సంతోషం



కుత్బుల్లాపూర్ , జనవరి 10, ( ప్రజాపాలన ) : మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడడంలో ఇలాంటి శిక్షణా తరగతులు ఎంతగానో ఉపయోగ పడతాయని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. బుధవారం జగద్గిరిగుట్ట డివిజన్ భూదేవి హిల్స్ నందు గల భూదేవి మహిళా పరపతి సంఘం, తెలంగాణ రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ, దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం సంయుక్త అధ్వర్యంలో నిర్వహించిన టైలరింగ్, బ్యూటీషియన్ శిక్షణా తరగతుల సర్టిఫికెట్స్ ప్రధానోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సంధర్బంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు మగవారికి ఏ మాత్రం తగ్గరు అన్నట్టుగా మహిళలు స్వయం ఉపాధి వైపు అడుగులు వేయడం చాలా సంతోషకరమన్నారు. మహిళలు స్వయం ఉపాధి చెందుతూ పది మందికి మార్గం చూపేవారుగా ఎదగాలన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడంలో నా వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. దేశ పురోగతి మహిళల స్వయం ఉ పాధితోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఛైర్మన్ వేణు యాదవ్, డైరెక్టర్లు బండ అనితా మహేందర్, ఈ .వెంకటేష్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కృష్ణా గౌడ్, సయ్యద్ రషీద్, విఠల్ ముదిరాజ్, యువ నాయకులు కొలుకుల జైహింద్, బాల క్రిష్ణ, త్రివేణి, మధు, దాసు, భూదేవి మహిళా పరపతి సంఘం అధ్యక్షురాలు త్రివేణి దేశినేని, దుర్గాబాయి మహిళా శిశువికాస కేంద్రం స్కిల్ డెవలప్మెంట్ లక్ష్మి కుమారి, మోవో (మూవింగ్ ఉమెన్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ సుబ్రా, భారతీయ యువ శక్తి ఎన్జీఓ ట్రస్ట్ ప్రతినిధి లక్ష్మీకాంత్, కార్డ్ ఇంచార్జి స్కిల్ డెవలప్మెంట్ లక్ష్మణ్, హొడర్షక్ సంస్థ ప్రతినిధి సత్యవాణి, పి.ఎల్.ఎన్.సీ. ట్రస్ట్ ప్రతినిధి ప్రత్యూష, భాగ్యలక్ష్మి ఫౌండేషన్ ప్రతినిధి మాణిక్య చారి తదితరులు పాల్గొన్నారు.

# అఖండ విజయాన్ని అందించిన కుత్బుల్లాపూర్ ప్రజలకు సదా రుణపడి ఉంటా: కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

కుత్బుల్లాపూర్ , జనవరి 10, ( ప్రజాపాలన ) : అఖండ విజయాన్ని అందించిన కుత్బుల్లాపూర్ ప్రజలకు సదా రుణపడి ఉంటానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు.బుధవారం జగద్గిరిగుట్ట డివిజన్ షిరిడి హిల్స్, కూన మహాలక్ష్మి నగర్, రాజీవ్ గృహకల్ప, భూదేవి హిల్స్ లలో కృతజ్ఞత యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా షిరిడి హిల్స్ లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పూల మాలలు వేసి నివాళ్ళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోట్లాది రూపాయల నిధులతో గత తొమ్మిదేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి మీ ఇంటి బిడ్డగా తనకు అఖండ విజయాన్ని అందించారన్నారు. అనంతరం హ్యాట్రిక్ విజయాన్ని సాధించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ను కాలనీవాసులు శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలుకుల జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్రా అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు కృష్ణా గౌడ్, సయ్యద్ రషీద్, విఠల్ ముదిరాజ్, యువ నాయకులు జైహింద్, బాలకృష్ణ, మధు, కూన మహాలక్ష్మి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎర్ర లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కోశాధికారి గిరిబాబు, కాలనీవాసులు హనుమయ్య, జి. మహంకాళి, అనిత, చంద్రకళ, ఏ.సిద్ధయ్య, డాక్టర్ అంజయ్య, ఈస్తో రెడ్డి, నరసింహ, విఠల్, దాసు, తిరుమల రెడ్డి, సోమయ్య, బాలకృష్ణ, ఉప్పలయ్య, రామకృష్ణ, మల్లా చారి, అంజయ్య, త్రివేణి, పార్వతమ్మ, గోపిక, విజయలక్ష్మి , ప్రభాకర్, వనం శ్రీను, మమత, లత, మాధవి, పరశురామ్, అంజయ్య, వెంకటస్వామి గౌడ్, నర్సిహ్మారెడ్డి, సంతోష్, యమున, అనిత, జితేందర్, షిరిడి హిల్స్ అధ్యక్షులు సీహెచ్.దాసు, ప్రధాన కార్యదర్శి బి. చంద్ర శేఖర్, కోశాధికారి ఎం.శేషు, కాలనీవాసులు బండ మహేందర్, ఎం.ప్రభాకర్, లక్ష్మణ్, నాగేశ్వరరావు, గణపతి, జాన్, చందు, ఆదర్శ్, అనిల్, ఎస్.రాజు, డానియల్ పాల్ తదితరులు పాల్గొన్నారు.






























# లక్షలు వెచ్చించినా నెరవేరని లక్ష్యం!

## పూడిక, పొదలతో నిండిన భీమారం ఆనకట్ట

### 30 ఏళ్లుగా చెరువులోకి చేరని వరద నీరు
### సాంకేతిక లోపాన్ని సరిచేయని అధికారులు
### వృథాగా పోతున్న నీరు.. బీళ్లుగా భూములు

షాద్‌నగర్ రూరల్, జనవరి 10: ప్రజాపాలన ప్రతినిధి: అధికారుల అనాలోచిత పనులతో భూములకు సాగునీరు అందించాలనే లక్ష్యం నెరవేరలేదు. దశాబ్దాల కింద వాగుపై ఆనకట్ట నిర్మించి నీటిని అయ్యావారిపల్లి నల్లచెరువులోకి మళ్లించేందుకు పనులు చేశారు. పైపులతో వేసిన ఆనకట్టతో చెరువు నింపాలనుకున్నా పైపుల కింది నుంచే నీరంతా ప్రవహించింది తప్ప చెరువులోకి చేరలేదు. ఆనకట్టలో సాంకేతిక లోపాన్ని సవరించి చెరువు నింపాలని రైతులు విన్నవించినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించు కోలేదు. కొత్త ప్రభుత్వం అయినా వాగు నీటిని చెరువులోకి తరలించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. తద్వారా వందలాది ఎకరాల ఆయకట్టుకు నీరందు తుందని అంటున్నారు.వర్షాధారంగా సాగుచేసే రైతుల కోసం చెరువులు నింపి సాగునీటిని అందించాలని 30ఏళ్ల కింద నిర్మించిన ఆనకట్ట లక్ష్యం నెరవేరకపోవడంతో నేటికీ పొలాలకు నీరందడం లేదు. పథకాన్ని పూర్తిచేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో చిన్న నీటి పారుదల శాఖ మంత్రిగా పనిచేసిన పి.శంకర్‌రావు హయాంలో అయ్యావారిపల్లి వాగుపై కోటి నిధులు మంజూరు చేయించి ఆనకట్ట నిర్మించారు. కుడి కాలువ నుంచి అయ్యావారిపల్లి నల్లచెరువులోకి నీటిని మళ్లించాలని ప్రణాళిక రూపొందించారు. అందుకోసం చెరువు వరకు కాలువ తవ్వించారు. కాలువ మధ్యలో చిన్నవాగుపై దిమ్మెలు కట్టి నీరు వెళ్లేందుకు పైప్‌లైన్ వేశారు. పైప్‌లైన్‌ను సాంకేతిక లోపంతో వేయడంతో పైప్‌లైన్ కింద మట్టి కొట్టుకుపోయి దాని కిందినుంచి నీరు పారుతోంది తప్పితే నీరు మళ్లడం లేదు. పైప్‌లైన్‌నే ఆనకట్ట వలె వేయాలనుకున్నా ఆ పని వృథాగా మారింది. మట్టి కొట్టుకు పోవడంతో నీరు ముందుకు పారడం లేదు. దీంతో వరద సముద్రంలో చేరుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా పనులు చేయాలేదు. ఎడమ కాలువ నుంచి వరద చించోడులోని బొమ్మ చెరవులోకి మళ్లించాలని ప్రణాళిక వేశారు. ఆనకట్ట నుంచి 100మీటర్ల దూరం కాలు తవ్వి వదిలేశారు. కొందుర్గు మండలం వీరసముద్రం వద్ద పుట్టి జీవనదిగా ప్రవహించే వాగును చెరువులోకి మళ్లిస్తే చెరువు నిండి పంటలు పండించుకోవచ్చని రైతులు ఆశిస్తున్నారు. ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదని వారు అంటున్నారు. మిషన్ కాకతీయ కింద రూ.23లక్షలతో మరమ్మతులుబీఆర్ఎస్ ప్రభుత్వంలో అమలు చేసిన మిషన్ కాకతీయలో వరద నీరు చెరువులోకి మళ్లింపునకు రూ.23లక్షలతో మరమ్మతులు చేశారు. కానీ కాలువ మధ్యలో నిర్మించిన పైప్‌లైన్ సాంకేతిక లోపాన్ని సరిచేయలేదు. ప్రస్తుతం చెరువు ఎండిపోయింది. ఇప్పుడే సాంకేతిక లోపాన్ని సరిచేయాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. చెరువులోకి నీరు చేరితే 100ఎకరాలు సాగవుతుందని, గత పాలకులు ఇది సరి చేయలేదన్నారు. ఇప్పటికైనా వరద చెరువులోకి చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.నిరాదరణకు గురైన భీమారం ఆనకట్ట నవాబుల కాలంలో 200 ఎకరాలకు నీరందించేలా నిర్మించిన భీమారం ఆనకట్ట దశాబ్దాలుగా నిరాదరణకు గురవుతోంది. ఇంత పెద్ద ఆనకట్ట పూడికతో నిండి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. కంసాన్‌పల్లితో పాటు సూరారం లోని 200ఎకరాలకు ఈ ఆనకట్ట నీరందేది. వీర సముద్రం నుంచి వచ్చే వరద నీటిని నిల్వ చేసేందుకు కూడా దీనిని నిర్మించారు. తూం శిథిలమైంది. కట్ట కింది నుంచి నీరు లీక్ అయి వృథాగా పోతోంది. భూములకు నీరందించే ఆనకట్టలకు మరమ్మతులు చేయించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై, అధికారులపై ఉంది. చెరువులోకి నీరు చేరేలా చర్యలు తీసుకోవాలి : విజేందర్‌రెడ్డి, రైతు, అయ్యావారిపల్లి ఆనకట్ట నిర్మించి సుమారు 30ఏళు అయింది. చిన్న లోపంతో వరద చెరువులోకి పోవడం లేదు. ఆ లోపాన్ని సరిచేసి చెరువులోకి నీరు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

## మున్సిపాల్టీల్లో పాగా... దిశగా అడుగులు




మహబూబ్ నగర్, జనవరి 10,ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థలు, మున్సిపాలిటీలపై ఫోకస్ పెట్టింది. పాలకవర్గాలకు ఏడాది మాత్రమే గడువున్నప్పటికీ మున్సిపాలిటీల్లో అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు ప్రణాళికలు రచిస్తోంది. తాజాగా పాలమూరు మున్సిపాలిటీలో అవిశ్వాసం హీట్ పెంచుతోంది. రాష్ట్రంలోని అతిపెద్ద మున్సిపాలిటీని హస్తగతం చేసుకునేందుకు కాంగ్రెస్ పావులు కదుపుతోంది.ఇటీవలే ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో 14 స్థానాలకుగాను, 12చోట్ల గెలుపొంది జోరుమీదుంది కాంగ్రెస్ పార్టీ. దీంతో ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థలు, మున్సిపాలిటీలను సొంతం చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు నేతలు. ఎన్నికల మందు పార్టీలో చేరిన కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీల సంఖ్యను బేరీజు వేసుకోవడంతో పాటు తాజాగా మద్దతు ఇచ్చే వారితో కలుపుకోని అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైంది.మహబూబ్ నగర్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ అసమ్మతి కౌన్సిలర్లు కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం కౌన్సిలర్లతో చేతులు కలిపారు. ప్రస్తుత మున్సిపల్ ఛైర్మన్ నర్సింహులుపై జిల్లా కలెక్టర్ రవినాయక్‌కు 32మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాన్ని అందజేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన 19మంది, కాంగ్రెస్ 6, ఎంఐఎం 4, బీజేపీ 3 కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేశారు. నాలుగేళ్లుగా తమ వార్డులకు నిధులు ఇవ్వకపోవడంతో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని తీర్మానంలో పేర్కొన్నారు.మహబూబ్ నగర్ మున్సిపాలిటీలో 36మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీకి చెందినవారు ఉన్నారు. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో దాదాపు 20మంది కౌన్సిలర్లు కాంగ్రెస్ వైపు వచ్చినట్లు తెలుస్తోంది. మరికొంత మంది కౌన్సిలర్లు సైతం కాంగ్రెస్ తో టచ్ లో ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. గత కొంత కాలంగా ఊగిసాలాడుతున్న మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానానికి ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిన కౌన్సిలర్ అనంద్ గౌడ్ తో పాటు, కాంగ్రెస్ ముఖ్యనేతలు ఎన్ పీ వెంకటేశ్, సురేందర్ రెడ్డి ప్రణాళికలు రచించారు. ఎన్నికల ముందు పార్టీ మారిన కౌన్సిలర్లపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశామని మున్సిపల్ ఛైర్మన్ నర్సింహులు ప్రకటించిన 24గంటల్లోనే ఆయనపై మిగిలిన కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాన్ని కలెక్టర్ కు అందించడం గమనార్హం.తీర్మానం తదుపరి ప్రక్రియపై మహబూబ్ నగర్ రాజకీయాల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం కాపీని కలెక్టర్ రవి నాయక్ త్వరలోనే మున్సిపల్ కమిషనర్ కు పంపనున్నారు. తీర్మానం కాపీలో ఉన్న సంతకాలను వెరిఫికేషన్ చేయడంతో పాటు కౌన్సిలర్ల అభిప్రాయాలను మున్సిపల్ కమిషనర్ కలెక్టర్ కు నివేదించనున్నారు. తదుపరి కౌన్సిల్ ప్రత్యేక సమావేశానికి ఏర్పాటు చేసి అవిశ్వాస తీర్మానం అంశాన్ని తేల్చే అవకాశం ఉంటుంది. హఠాత్తుగా జరిగిన అవిశ్వాస తీర్మానం పరిణామంతో బీఆర్ఎస్ కంగుతింది. మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానంపై చైర్మన్ నర్సింహులు హైకోర్ట్ ను ఆశ్రయించినట్లు సమాచారం.

## సంప్రదాయాలు కొనసాగించాల్సిన భాధ్యత మనందరిది: ప్రధానోపాధ్యాయులు చెరుపల్లి శ్రీహరి



మధిర రూరల్ జనవరి 10 ప్రజాపాలన ప్రతినిధి మండలంలోని మాటూర్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పాఠశాల విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు నిర్వహించడం జరిగిందిఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెరుపల్లి శ్రీహరి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కొనసాగించాల్సిన బాధ్యత మనందరిది అని పేర్కొన్నారు.అనంతరం రంగవల్లుల పోటీల విజేతలకు పి ఇ టి రమాదేవి బహుమతులు అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కరీంనగరం... ఎవరికి వరం




కరీంనగర్, జనవరి 10,ప్రజాపాలన ప్రతినిధి: తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఆ ఎంపీ స్థానం ఛాలెజింగ్‌గా మారింది. అక్కడ రెండు విపక్షాలు బలంగా ఉన్నాయి. అటు బీజేపీ, ఇటు బీఆర్ఎస్ గట్టి పోటినిచ్చే ఆ స్థానంలో కాంగ్రెస్ ఏమేర ఓట్లు సాధిస్తుందన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇంతకీ ఆ పార్లమెంట్ స్థానం ఎక్కడ.? అంతలా పోటీ ఉండడానికి కారణం ఏంటో తెలియాలంటే ఈ స్టోరీలోకి వెళ్లాల్సిందే.కరీంనగర్ పార్లమెంట్ సీటు గెలవడం కాంగ్రెస్ కి కీలకంగా మారింది. ఇక్కడ రెండు విపక్షాలు బలంగా ఉన్నాయి. ఈ పార్లమెంట్ పరిధిలిలో బీఆర్ఎస్ గట్టి పోటీనిస్తుంది. అలాగే బీజేపీ కూడా ఓటింగ్ శాతాన్ని పెంచుకుంది. ఇన్ని సవాళ్లను అదిగమించి కాంగ్రెస్ ముందుకు వెళ్లే ప్లాన్ చేస్తుంది. తెలంగాణ ఉద్యమంలో కరీంనగర్ కీలక పాత్ర పోషించింది. ఇక్కడి నుంచి కేసీఆర్ ఎంపీగా పోటీ చేసి ఉద్యమాన్ని ఉధృతం చేశారు. అంతేకాదు.. ప్రతీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఇక్కడి ప్రజలు ఆదిరంచారు.2019 ఎన్నికల్లో మాత్రం బీజేపీ గట్టి షాక్ ఇచ్చింది. ఇక్కడ బీజేపీ అభ్యర్థి సంజయ్ విజయం సాధించారు. తర్వాత బీఆర్ఎస్ బలహీనపడుతూ వచ్చింది. మొన్న జరిగిన ఆ సెంబ్లీ ఎన్నికల్లో నాలుగు సిట్టింగ్ ఎమ్మెల్యేలను కోల్పోయింది. అయితే కరీంనగర్ పార్లమెంట్ పరిధిలిలో కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్‌కి ఎక్కువ ఓట్లు వచ్చాయి. అదేవిధంగా బీజేపీ ఓటు బ్యాంకును గణనీయంగా పెంచుకుంది. ఇక్కడ బీజేపీ నుంచి సంజయ్, బీఆర్ఎస్ నుంచి వినోద్ మరోసారి బరిలోకి దిగనున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి విషయంలో మాత్రం ఇంకా స్పష్టత రాలేదు. హుస్నాబాద్ ఎమ్మెల్యే మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కరీంనగర్ పార్లమెంట్ బాధ్యతలు అప్పుజెప్పారు.గత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ మూడవ స్థానికి పరిమితమైంది. ఇప్పుడు. కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో ఈ సీటుపై ఫోకస్ పెట్టింది. ఇప్పటికే, కాంగ్రెస్ నేతలు వర్క్ ప్రారంభించారు.. ఇందులో భాగంగానే బలమైన క్యాండిట్ కోసం దృష్టి పెడుతున్నారు. ప్రస్తుతం ఎంఎల్సీ జీవన్ రెడ్డి, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగిరి ప్రణ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగపతిరావు తనయుడు వెలిచాల రాజేందర్ రావు పేర్లు వినిపిస్తున్నాయి. కరీంగనర్‌లో బీజేపీ, బీఆర్ఎస్‌లను ఎదుర్కోవాలంటే.. బలమైన నేత కావాలి, అంతేకాకుండా.. బండి సంజయ్ దూకుడుగా వెళ్తున్నారు. ఇప్పటికే.. ఎన్నికల కోసం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వినోద్ కూడా? ప్రచారం మొదలుపెట్టారు.ఇక కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో నలుగురు కాంగ్రెస్ అభ్యర్థులు తాజా ఎన్నికల్లో విజయం సాధించారు.. కరీంనగర్ ఎంపీ స్థానం ఇటు నిజామాబాద్‌తో పాటు, పెద్దపల్లి స్థానంపై ప్రభావం చూపుతుంది. దీంతో కాంగ్రెస్ నేతలు ఆచి తూచి అడుగులు వేస్తున్నారు. కరీంనగర్ అసెంబ్లీ స్థానంపై మరింత దృష్టి పెడుతున్నారు. ఇక్కడ.. ఇతర పార్టీల చెందిన నేతలను.. పార్టీలో చేర్పించుకునేందుకు ప్లాన్ చేస్తున్నారు. గత ఎంపీ ఎన్నికల్లో మూడవ స్థానంలో ఉన్న కాంగ్రెసు ఇప్పుడు మొదటి స్థానంలోకి తీసుకురావడంపై దృష్టి సారిస్తున్నారు. కరీంనగర్ అసెంబ్లీలో సుమారు గా 3 లక్షల 50 వేల ఓట్లు ఉన్నాయి. ఇక్కడ కాంగ్రెస్ బలహీనంగా ఉంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో.. కరీంనగర్‌లో కాంగ్రెస్‌కి కేవలం 40 వేల ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో ఈ స్థానంపై మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డితో పాటు ముఖ్య నేతలంతా దృష్టిసారించారు.

## జిహెచ్‌ఎంసి కమిషనర్ ను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మేడిపల్లి, జనవరి10 (ప్రజాపాలన ప్రతినిధి): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్ రోనార్డ్ రాస్ ను బుధవారం నాడు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని పెండింగ్ లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి జిహెచ్‌ఎంసి కమిషనర్ను కోరారు.



## కాకతీయ వర్శిటీలో వివాదాలు...




వరంగల్, జనవరి 10,ప్రజాపాలన ప్రతినిధి: కాకతీయ వర్శిటీలో వీసీ నియామకం నుంచి వివాదాలు వెంటాడుతుండగా.. తాజాగా కాంట్రాక్టర్ కు బిల్లులు ఇచ్చేందుకు ఆడిట్ సెక్షన్ అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్య లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడం కలకలం రేపింది.ఆ తరువాత కూడా అదే పరిస్థితులు కొనసాగుతుండటం కూడా కలవరానికి గురి చేస్తోంది. దీంతోనే కాకతీయ యూనివర్సిటీ ప్రక్షాళనపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఇక్కడి విద్యార్థి, ఉద్యోగ సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.యూనివర్సిటీ హాస్టళ్లకు పాలు, పెరుగు సప్లై చేసే కాంట్రాక్టర్ కు బిల్లులు చెల్లించే విషయంలో ఇక్కడి అధికారులు చేతివాటం చూపారు. పెండెం రాజేందర్ అనే కాంట్రాక్టర్ వర్సిటీలోని నాలుగు హాస్టళ్లకు గతేడాది వరకు పాలు, పెరుగు సరఫరా చేయగా.. ఆయనకు దాదాపు 19 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది.ఆ బిల్లులు చెల్లించడానికి ఆడిట్ ఆఫీసర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్య లంచం డిమాండ్ చేశారు. రూ.50 వేలు ఇస్తేనే బిల్లులు క్లియర్ చేస్తానని చెప్పడంతో చివరకు సదరు కాంట్రాక్టర్ కిష్టయ్యను ఏసీబీకి పట్టించారు.చదువులకు నిలయమైన విశ్వవిద్యాలయంలో అవినీతి బాగోతం బయటపడటంతో సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ ఘటన జరిగిన మరునాడే మరో వివాదం కేయూ ఆఫీసర్లను చుట్టుముట్టింది. న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ కోసం క్యాంపస్ లో వివిధ పనులు చేయగా.. దానికి సంబంధించిన బిల్లులు ఇవ్వడం లోనూ ఆఫీసర్లు కమీషన్లకు ఆశపడ్డారు.ఈ మేరకు కమీషన్లు అందేదాకా బిల్లులు రిలీజ్ చేయకపోవడంతో ఆ కాంట్రాక్ట్ పనులు చేసిన వ్యక్తి మనోవేదనకు గురై చివరకు ప్రాణాలు కోల్పోయాడు. దీంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఆదివారం సాయంత్రం వీసీ బిల్డింగ్ కు తీసుకొచ్చి పెద్ద ఎత్తున ధర్నా చేశారు. కాగా కేయూ అధికారులు బిల్లులు ఇవ్వకపోవడం వల్లే కాంట్రాక్టర్ చనిపోయారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.సక్రమంగా పనులు చేసే కాంట్రాక్టర్ల నుంచి లంచాలు డిమాండ్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్న కాకతీయ యూనివర్సిటీ అధికారులు కమీషన్లు ఇచ్చే కాంట్రాక్టర్లకు వరాత్రం వత్తాసు పలుకుతున్నట్లు తెలుస్తోంది. తాజా ఘటనల్లో ఇద్దరు కాంట్రాక్టర్లు ఆఫీసర్ల తీరుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనగా.. కమీషన్లు ఇస్తున్న కాంట్రాక్టర్లు క్వాలిటీ లేని ఫుడ్, పాలు, పెరుగు సరఫరా చేస్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.వర్సిటీలో 2023?24 విద్యాసంవత్సరానికి కిరాణా సామగ్రి, గుడ్లు, అరటి పండ్లు, పాలు, పెరుగు తదితర సరకులు సరఫరా చేసేందుకు 2023 ఆగస్టులో టెండర్లు నిర్వహించగా.. గతంలో సరఫరా చేసిన రాజేందర్ కు కాకుండా ఈసారి వేరే వ్యక్తికి టెండర్ ఇచ్చారు.వర్సిటీ అధికారుల నిబంధనల ప్రకారం నాణ్యమైన విజయ డెయిరీ లేదా ముల్కనూరు డెయిరీకి సంబంధించిన పాలు, పెరుగు మాత్రమే సరఫరా చేయాలి. కానీ ఆ రెండూ కాకుండా తక్కువ రేటు కలిగిన క్వాలిటీ లేని పాలు, పెరుగు సరఫరా చేస్తున్నారని కేయూ విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు నిబంధనలకు విరుద్ధంగా ఇతర కంపెనీలకు చెందిన పాలు, పెరుగు సప్లై చేస్తున్న ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.కాకతీయ యూనివర్సిటీ హాస్టళ్లలోని విద్యార్థులకు క్వాలిటీ లేని ఫుడ్ పెడుతున్నారని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు తీసుకుంటున్న అధికారులు అన్నీ తెలిసీ సైలెంట్ గా ఉంటున్నారని ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే నాణ్యతలేని సరుకులు పంపిణీ చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.కాకతీయ యూనివర్సిటీ వీసీగా ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ నియామకం అయినప్పటి నుంచి ఆయన తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2021 మే నెలలో ఆయన వీసీగా బాధ్యతలు తీసుకోగా ఆయనకు ప్రొఫెసర్ గా పదేండ్ల అనుభవం లేకున్నా వైస్ ఛాన్సలర్ పదవి అప్పగించడం వివాదానికి దారి తీసింది. నిబంధనలకు విరుద్ధంగా తాటికొండ రమేశ్ ను వీసీగా నియమించారంటూ కొందరు కోర్టుకు వెళ్లగా.. ఇప్పటికీ కేసులు నడుస్తున్నాయి.

పాటు వీసీ రమేశ్, రిజిస్ట్రార్ శ్రీనివాస రావు ప్రొఫెసర్ల ప్రమోషన్ల విషయంలోనూ అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణ లున్నాయి. రూల్స్ కు విరుద్ధంగా ఇద్దరూ సీనియర్ ప్రొఫెసర్లుగా ప్రమోషన్లు తీసుకోవడంతో పాటు మరికొందరి విషయంలోనూ రూల్స్ బ్రేక్ చేశారనే వివాదం ఇప్పటికీ కొనసాగుతోంది.కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్డీ సీట్ల కేటాయింపులో అక్రమాలు జరిగిన వ్యవహారం అప్పట్లో తీవ్ర కలకలం రేపింది. కొంతమంది అనర్హులకు పీహెచ్ డీ సీట్లు కట్టబెట్టారని విద్యార్థి సంఘాల నేతలు గత ఏడాది సెప్టెంబర్ 5వ తేదీ నుంచి దాదాపు 40 రోజుల పాటు నిరసన దీక్ష కొనసాగించారు.

